మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANA VISHWAM TELUGU DAILY

manavishwam.com



మీ కలానికి.. ఇదే వేదిక!

మన విశ్వం

జిల్లా ప్రతినిధులు

నియోజకవర్గ రిపోర్టర్లు

కావలెను

వార్త మీ బలం అయితే.. 'మన విశ్వం' మీ వేదిక!

630 563 8569

900 096 7680



వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 67 | ఆదివారం 23 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ.5 | PRGI, NO : TGTEL/26/A4450 | ఎడిటర్ : నమిండ్ల ప్రమోద్


## 22ఏ భూముల్లో 'కమీషన్ల దందా'!



- రాత్రికి రాత్రే ప్రైవేటు భూములు నిషేధిత జాబితాలోకి..
- భూభారతి అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- బీఆర్ఎస్ హయాంలో వేల ఎకరాలు.. కాంగ్రెస్‌లో లక్షల ఎకరాలు: కిషన్‌రెడ్డి
- '10 శాతం నుంచి 30 శాతానికి కమీషన్ పెరిగింది' అంటూ తీవ్ర ఆరోపణలు
- ప్రైవేటు భూముల్లో 50% వాటా అడుగుతున్నారని విమర్శ
- భాజపా అధికారంలోకి వస్తే 22ఏ భూములపై పునఃపరిశీలన చేస్తామని ప్రకటన

వివరాలు 2లో..

# ఖాకీపై 'ఖద్దర్' పెత్తనం!




**మాట వింటే కీలక పోస్టింగ్.. కాదంటే బదిలీ అస్త్రం!**

- కేసుల నుంచి పోస్టింగ్‌ల దాకా ప్రజాప్రతినిధుల జోక్యమనే విమర్శలు
- ఇష్టం లేకున్నా సర్దుకుపోతున్న కొందరు.. 'చట్టమే ఫైనల్' అంటున్న మరికొందరు
- స్టేషన్లలోనూ నేతల అనుచరుల హుకుం.. 'మా నాయకుడు చెప్పాడు' అంటూ ఒత్తిళ్లు
- ప్రైవేటు కార్యక్రమాలకూ ఖాకీని ఎస్కార్ట్‌గా వాడుతున్నారనే ఆరోపణలు
- పోలీసులకు స్వేచ్ఛ లేకుంటే సామాన్యుడికి న్యాయం ఎక్కడ?

**తెలంగాణ బ్యూరో, ఆగస్టు 22 (మన విశ్వం):** చట్టాన్ని అమలు చేయాల్సిన ఖాకీపై రాజకీయ 'ఖద్దర్' పట్టు బిగుస్తోందా? కేసుల నమోదు నుంచి దర్యాప్తు వరకు.. పోస్టింగ్‌ల నుంచి బదిలీల వరకు కొందరు ప్రజాప్రతినిధుల జోక్యం పెరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మాట వింటే కీలక పోస్టింగ్.. నిబంధనలే ముఖ్యమంటే బదిలీ అన్న పరిస్థితులు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. నేతల పేరుతో అనుచరులు సైతం స్టేషన్లలో హడావుడి చేస్తున్నారన్న చర్చ సాగుతోంది. ఈ ఒత్తిళ్లతో కొందరు అధికారులు సర్దుకుపోతుండగా.. మరికొందరు 'చట్టం ప్రకారమే నడుస్తాం' అంటూ నిలబడుతున్నట్లు సమాచారం. పోలీసులకు స్వేచ్ఛ లేకపోతే శాంతిభద్రతల పరిరక్షణ, సామాన్యుడికి నిష్పక్షపాత న్యాయం ఎలా సాధ్యమన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**మాట వింటే 'సీటు'.. కాదంటే 'వేటు'!**

నిబంధనల ప్రకారం నడుచుకునే పోలీసు అధికారులపై' బదిలీ'అస్త్రం ప్రయోగిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన

◆ మిగతా 2లో..

## కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ 'నాలెడ్జ్' బంధం!



- హైదరాబాద్‌ను ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- విద్య, పరిశోధనల్లో భాగస్వామ్యంపై కీలక చర్చలు
- సంయుక్త పరిశోధనలు.. స్టార్టప్‌లు, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం
- కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు ఇరువర్గాల అంగీకారం
- కేంబ్రిడ్జ్ విద్యావేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం

2లో..

## తప్పిస్తారా?.. తప్పుకునేలా చేస్తారా?

- కొండా సురేఖపై కాంగ్రెస్‌లో పెరుగుతున్న ఒత్తిడి!
- వరుస ప్రెస్‌మీట్లతో విరుచుకుపడుతున్న సొంత పార్టీ ఎమ్మెల్యేలు
- 'వెళ్లిపోవాలి' అంటున్న కొందరు.. 'రాజీనామా చేయాలి' అంటున్న మరికొందరు
- వ్యాఖ్యలు చేసింది కుమార్తె అయితే.. తల్లే లక్ష్యమెందుకు?
- చర్యలుంటే సుస్మితపై కదా?.. సురేఖపై వేటు డిమాండ్ వెనుక మర్మమేంటి?
- కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల్లో కొత్త చర్చకు తెర

2లో..

## 'నాపై గురిపెట్టిన ఆ అదృశ్య హస్తమెవరిది?'



- నన్ను.. నా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకోవడం వెనుక మర్మమేంటి?
- ఒకే స్వరం.. ఒకే తరహా ఆరోపణలు.. ఎవరి సంకేతాలతో?
- విచారణ జరుగుతుండగానే మీడియా ముందే తీర్పులా?
- క్రమశిక్షణ కమిటీ నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నమా?
- తెరవెనుక సూత్రధారులను గుర్తించి చర్యలు తీసుకోవాలి
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి మంత్రి కొండా సురేఖ లేఖ

## కరెంటు కొరతకు తావుండొద్దు!




- 2047 అవసరాలకు ఇప్పటి నుంచే ప్రణాళిక
- పెట్టుబడులకు తెలంగాణను ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం
- 13 వేల నుంచి 18 వేల మెగావాట్లు దాటిన గరిష్ఠ డిమాండ్
- థర్మల్‌తో పాటు సౌర, జల, పంప్డ్.. బ్యాటరీ స్టోరేజీపై దృష్టి
- విద్యుత్ ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2లో..

# అభివృద్ధికి ఆమడదూరంలో తాడిచెర్ల

- నల్లబంగారం తరలిపోతోంది.. పల్లెలకు మిగిలేదేంటి?
- తాడిచెర్లలో పదేళ్లుగా బొగ్గు తవ్వకాలు.. అభివృద్ధికి నోచని ప్రభావిత గ్రామాలు
- శాత్రాజపల్లిలో నాణ్యమైన బొగ్గు నిల్వలు.. ఓసీ-2 సింగరేణికి కేటాయింపు
- భూములు కోల్పోయినా ఉపాధి కరవే.. ధూళి, దెబ్బతిన్న రహదారులతో ఇక్కట్లు
- సీఎస్ఆర్, డీఎంఎఫ్ నిధుల లెక్కలు వెల్లడించాలని స్థానికుల డిమాండ్






**మల్హర్, ఆగస్టు 22 (మన విశ్వం):** నేలలో నల్లబంగారం.. నిత్యం లారీల్లో తరలిపోతున్న బొగ్గు.. ప్రభుత్వానికి, సంస్థలకు కోట్లలో ఆదాయం. గని కోసం భూములిచ్చిన పల్లెల్లో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలోని తాడిచెర్ల ఓసీ-1లో దాదాపు పదేళ్లుగా బొగ్గు తవ్వకాలు సాగుతున్నా.. ప్రభావిత గ్రామాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్న విమర్శలున్నాయి. ఇప్పుడు శాత్రాజపల్లి పరిసరాల్లోని తాడిచెర్ల ఓసీ-2 బ్లాక్‌ను కేంద్రం సింగరేణికి కేటాయించడంతో.. 'కొత్త గనితోనైనా మా ఊళ్ల తలరాత మారుతుందా?' అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**సంపద అపారం.. ఊళ్ల పరిస్థితి మాత్రం..**

శాత్రాజపల్లి ఓసీ-2 బ్లాక్‌లో భారీగా నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నట్లు మైనింగ్ అధికారులు గుర్తించారు. ఇక్కడ ఉత్పత్తి ప్రారంభమైతే దశాబ్దాల పాటు బొగ్గు వెలికితీతకు అవకాశం ఉండటంతో పాటు సింగరేణికి, ప్రభుత్వానికి

◆ మిగతా 2లో..




## రహదారికి మరమ్మతులు

**'మన విశ్వం' వార్తకు స్పందన..**

- తాడిచర్ల-కొయ్యూరు మార్గంపై ఓసీపీ అధికారుల చర్యలు
- యంత్రాలతో తాత్కాలిక పనులు.. ప్రయాణికులకు ఊరట
- శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల విజ్ఞప్తి


**మల్హర్, ఆగస్టు 22 (మన విశ్వం):** తాడిచర్ల-కొయ్యూరు ప్రధాన రహదారి దుస్థితిపై 'మన విశ్వం'లో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. వర్షాలతో బురదమయంగా మారి వాహనదారులకు ఇబ్బందికరంగా మారిన రహదారిపై స్థానిక

◆ మిగతా 2లో..



మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

# చంద్రయాన్ చూపిన దారి



చంద్రుడి దక్షిణ ధ్రువంపై భారత త్రివర్ణ పతాక ప్రతిష్ఠను చాటిన చంద్రయాన్-3 విజయం కేవలం ఒక అంతరిక్ష ప్రయోగం విజయవంతమైన సందర్భం మాత్రమే కాదు. పరిమిత వనరులతోనూ, పట్టుదలతోనూ, శాస్త్రీయ దృక్పథంతోనూ ప్రపంచ స్థాయి విజయాలను సాధించవచ్చని నిరూపించిన ఘట్టం. 2023 ఆగస్టు 23న విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో సురక్షితంగా దిగిన క్షణం భారత శాస్త్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆ రోజును జాతీయ అంతరిక్ష దినోత్సవంగా గుర్తించడం ఆ విజయాన్ని స్మరించుకోవడానికే కాదు, దేశంలో శాస్త్ర స్ఫూర్తిని మరింత విస్తరించాల్సిన అవసరాన్ని గుర్తుచేయడానికీ ఉపయోగపడాలి.

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రస్థానం సవాళ్లతోనే సాగింది. తొలి దశల్లో విదేశీ సాంకేతిక సహకారంపై ఆధారపడిన దేశం, నేడు స్వదేశీ పరిజ్ఞానంతో సంక్లిష్ట ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించే స్థాయికి చేరింది. ఈ మార్పు ఒక్కరోజులో సంభవించింది కాదు. దశాబ్దాల పరిశోధన, వేలాది మంది శాస్త్రవేత్తల కృషి, వరుస ప్రయోగాల ద్వారా సేకరించిన అనుభవం దీనికి పునాది. తక్కువ ఖర్చుతో అత్యున్నత ఫలితాలు సాధించగల భారత అంతరిక్ష కార్యక్రమం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించడం యాదృచ్ఛికం కాదు.

చంద్రయాన్-3 విజయానికి చంద్రయాన్-2 వైఫల్యమే ఒక ముఖ్యమైన పాఠమైంది. చివరి క్షణంలో ల్యాండర్‌తో సంబంధం తెగిపోవడంతో ఎదురైన నిరాశను శాస్త్రవేత్తలు అక్కడితో ముగించలేదు. లోపాలను విశ్లేషించారు. సాంకేతిక వ్యవస్థలను మెరుగుపరిచారు. మరింత జాగ్రత్తగా తదుపరి ప్రయోగాన్ని సిద్ధం చేశారు. అదే పట్టుదల చివరకు విజయాన్ని అందించింది. వైఫల్యం అనేది ప్రయాణానికి ముగింపు కాదని, దానిని సరిగా విశ్లేషిస్తే తదుపరి విజయానికి పునాదిగా మారుతుందని చంద్రయాన్-3 మరోసారి నిరూపించింది.

అంతరిక్ష పరిశోధనల ప్రయోజనాలను కేవలం చంద్రుడు, గ్రహాల అధ్యయనానికి మాత్రమే పరిమితం చేయలేం. ఉపగ్రహ సాంకేతికత నేడు సామాన్యుల జీవితంలో భాగమైంది. వాతావరణ అంచనాలు, తుపాను హెచ్చరికలు, వ్యవసాయ సమాచార సేవలు, సమాచార ప్రసారాలు, విపత్తు నిర్వహణ, నావిగేషన్, దేశ భద్రత.. ఇలా అనేక రంగాలు అంతరిక్ష సాంకేతికతపై ఆధారపడుతున్నాయి. రైతుకు వర్ష సూచన అందడం నుంచి ప్రకృతి విపత్తు సమయంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేయడం వరకు ఉపగ్రహాల పాత్ర కీలకం. అందువల్ల అంతరిక్ష పరిశోధనలకు వెచ్చించే నిధులను ఖర్చుగా కాకుండా దేశ అభివృద్ధికి పెట్టుబడిగా చూడాలి.

ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగం వేగంగా మారుతోంది. ప్రభుత్వ సంస్థల ఆధిపత్యం ఉన్న ఈ రంగంలో ప్రైవేటు సంస్థలు, స్టార్టప్‌లు, యువ ఆవిష్కర్తలు కూడా ప్రవేశిస్తున్నారు. ఉపగ్రహాల తయారీ, ప్రయోగ సేవలు, అంతరిక్ష ఆధారిత సమాచార వ్యవస్థలు కొత్త ఆర్థిక అవకాశాలను సృష్టిస్తున్నాయి. భారత్ ఈ రంగంలో తన సామర్థ్యాన్ని మరింత విస్తరించగలిగితే శాస్త్ర సాంకేతిక పురోగతితో పాటు ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధికి కూడా కొత్త మార్గాలు తెరుచుకుంటాయి.

అయితే చంద్రయాన్ విజయానికి అసలైన అర్థం భావితరాలపై దాని ప్రభావంలోనే ఉంది. ఈ ప్రయోగాన్ని చూసి ఆశ్చర్యపోయిన విద్యార్థుల్లో శాస్త్రంపై ఆసక్తి పెరగాలి. పాఠశాలలు, కళాశాలల్లో శాస్త్రీయ ఆలోచనకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రశ్నించే తత్వాన్ని, ప్రయోగాలు చేసే ధైర్యాన్ని, వైఫల్యాల నుంచి నేర్చుకునే మనస్తత్వాన్ని పెంపొందించాలి. కేవలం పరీక్షల కోసం చదివే విద్యార్థులు కాకుండా సమస్యలకు పరిష్కారాలు వెతికే యువతను తీర్చిదిద్దడం విద్యా వ్యవస్థ బాధ్యత.

భారత్ ముందు ఇంకా పెద్ద లక్ష్యాలున్నాయి. గగన్‌యాన్ ద్వారా మానవ సహిత అంతరిక్ష యాత్ర, తదుపరి చంద్ర ప్రయోగాలు, అంతరిక్ష కేంద్ర నిర్మాణం వంటి కార్యక్రమాలు దేశ శాస్త్ర సామర్థ్యానికి కొత్త పరీక్షలు. ఇప్పటివరకు సాధించిన విజయాలతో సంతృప్తి చెందకుండా పరిశోధనలకు నిరంతర మద్దతు ఇవ్వాలి. ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలకు అవసరమైన వనరులు, స్వేచ్ఛ కల్పించాలి. స్వదేశీ సాంకేతికతను మరింత బలోపేతం చేయాలి.

చంద్రయాన్-3 విజయం భారత ఆత్మవిశ్వాసానికి ప్రతీక. అది చంద్రుడిపై దిగిన ఒక ల్యాండర్ విజయమే కాదు; కలలను లక్ష్యాలుగా మార్చుకుని, వాటి కోసం నిరంతరం కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదనే సందేశం. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఒక వేడుకగా పరిమితం చేయకుండా శాస్త్ర విజ్ఞానంపై సమాజంలో విశ్వాసాన్ని పెంపొందించే సందర్భంగా మలచాలి. చంద్రుడిపై భారత్ వేసిన అడుగు చిన్నదైనా, దేశ భవిష్యత్తు వైపు చూపిన దారి మాత్రం ఎంతో విశాలమైనది.

*– నమిండ్ల. ప్రమోద్, ఎడిటర్*

# అభివృద్ధికి ఆమడ దూరంలో తాడిచెర్ల

(మొదటిపేజీ తరువాయి)

భారీ ఆదాయం సమకూరనుంది. అయితే గనుల ప్రభావాన్ని నేరుగా ఎదుర్కొనే గ్రామాలకు ఆ ఆదాయంలో అభివృద్ధి రూపంలో ఎంత తిరిగివస్తుందన్నదే స్థానికుల సందేహం.

**బొగ్గు లారీలు.. గుంతల రహదారులు**

ఓసీ-1 నుంచి బొగ్గు రవాణా చేసే భారీ వాహనాల రాకపోకలతో రహదారులు దెబ్బతింటున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. బొగ్గు ధూళితో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కాలుష్యంపై ఆందోళన పెరుగుతోందని పేర్కొంటున్నారు. ఓసీ-2 ప్రారంభమైతే ఈ సమస్యలు మరింత పెరగకుండా ముందుగానే నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**భూములిచ్చాం.. ఉపాధి ఇవ్వండి**

గనుల కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు పరిహారంతో సరిపెట్టకుండా జీవనోపాధికి భరోసా కల్పించాలని నిర్వాసితులు కోరుతున్నారు. స్థానిక యువతకు అర్హతలు, నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఓసీ-2 పరిధిలో భూములు కోల్పోయే వారికి పరిహారం, పునరావాసం (ఆర్అండ్ఆర్), ఉపాధిపై ముందుగానే స్పష్టత ఇవ్వాలంటున్నారు.

**పదేళ్ల లెక్క చెప్పండి!**

తాడిచెర్ల ఓసీ-1 ప్రారంభమైనప్పటి నుంచి సీఎస్ఆర్ కింద ఎంత నిధి ఖర్చయింది? డీఎంఎఫ్‌కు ఎంత సమకూరింది? మల్హర్‌రావు మండలానికి ఎంత కేటాయించారు? తాడిచెర్ల, శాత్రాజపల్లి సహా ప్రభావిత గ్రామాల్లో చేపట్టిన పనులెన్ని? అనే వివరాలను బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఓసీ-2లో ఉత్పత్తి ప్రారంభానికి ముందే తాగునీరు, రహదారులు, వైద్యం, విద్య, కాలుష్య నియంత్రణ, ఉపాధితో కూడిన ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక ప్రకటించాలని కోరుతున్నారు. నల్లబంగారం ప్రభుత్వ ఖజానాకు ఆదాయం తెస్తున్నప్పుడు.. దాన్ని తన గర్భంలో దాచుకున్న పల్లెలకు అభివృద్ధిలో వాటా దక్కాల్సిందేనని మల్హర్ వాసులు స్పష్టం చేస్తున్నారు.

# రహదారికి మరమ్మతులు

(మొదటిపేజీ తరువాయి)

ఓసీపీ అధికారులు శనివారం తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. యంత్రాల సాయంతో దెబ్బతిన్న ప్రాంతాలను చదును చేస్తూ రాకపోకలకు వీలుగా పనులు నిర్వహించారు. దీంతో నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పరిసర గ్రామాల ప్రజలకు కొంత ఊరట లభించింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన 'మన విశ్వం'కు, వార్తపై స్పందించి పనులు చేపట్టిన ఓసీపీ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా రహదారికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# 22ఏ భూముల్లో 'కమీషన్ల దందా'!

**హైదరాబాద్, ఆగస్టు 22(మన విశ్వం) :** రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల జాబితాను అడ్డుపెట్టుకుని పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. దశాబ్దాలుగా ప్రజల ఆధీనంలో ఉండి, పన్నులు చెల్లిస్తున్న ప్రైవేటు భూములను సైతం రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో చేరుస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూభారతి పోర్టల్ వ్యవహారాలపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో శనివారం మీడియాతో మాట్లాడిన కిషన్‌రెడ్డి.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేలాది ఎకరాలను 22ఏ జాబితాలో చేర్చి అక్రమాలకు పాల్పడ్డారని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఆ వ్యవహారం లక్షల ఎకరాలకు విస్తరించిందని ఆరోపించారు. "బీఆర్ఎస్ హయాంలో 10 శాతం కమీషన్ ఉంటే.. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో 30 శాతానికి చేరింది. కొన్ని ప్రైవేటు భూముల విషయంలో ఏకంగా 50 శాతం వాటా అడుగుతున్నారు" అని ధ్వజమెత్తారు.

**ఎమ్మెల్యేకు నచ్చకపోతే 22ఏలోకే!**

స్థానిక ఎమ్మెల్యేకు ఇష్టం లేకపోతే భూములను 22ఏ జాబితాలో చేర్చే పరిస్థితి నెలకొందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో ముఖ్యమంత్రి ఇంటిని కూడా నిషేధిత జాబితాలో చేర్చారా? అని ప్రశ్నించారు. ధరణికి ప్రత్యామ్నాయంగా తెచ్చిన భూభారతి ప్రజల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి నవ్వులపాలైందన్నారు. హైదరాబాద్ పరిసరాల్లోని విలువైన ప్రభుత్వ భూములను అమ్మేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, వాటిని ఎందుకు విక్రయించాల్సి వస్తోందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ సంస్థలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారంటూ ఆరోపించారు.

22ఏ భూముల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు భాజపా లీగల్ సెల్ న్యాయ సహాయం అందిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధిత జాబితాలో చేర్చిన భూములన్నింటినీ పునఃపరిశీలిస్తామని కిషన్‌రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనల అనుమతుల అంశంపైనా స్పందించిన ఆయన.. పర్యటన ప్రాధాన్యతను బట్టి అనుమతులు ఉంటాయని, ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అమల్లో ఉన్న నిబంధనలే ఇప్పటికీ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# కరెంటు కొరతకు తావుండొద్దు!

హైదరాబాద్, ఆగస్టు 22(మన విశ్వం) : రాష్ట్రంలో భవిష్యత్తులో విద్యుత్ కొరత అనే మాటే వినిపించకుండా ఇప్పటి నుంచే దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. పరిశ్రమలకు విద్యుత్, నీటి కొరత లేకుండా మౌలిక వసతులు కల్పిస్తామని, దేశవ్యాప్తంగా పెట్టుబడిదారులు తెలంగాణలో తయారీ, సేవా రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'పవర్ ఎగ్జిబిషన్-2026'ను భట్టి శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో 13 వేల మెగావాట్లుగా ఉన్న గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ప్రస్తుతం 18 వేల మెగావాట్లు దాటిందన్నారు. డిమాండ్ భారీగా పెరిగినా ముందస్తు ప్రణాళికలు, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ బలోపేతం, సకాలంలో విద్యుత్ సమీకరణతో అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నామని చెప్పారు.

**2047 లక్ష్యంగా..**

విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటుకు నాలుగైదేళ్లు పట్టే అవకాశం ఉన్నందున 2047 వరకు అవసరాలను ఇప్పుడే అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్లు భట్టి తెలిపారు. థర్మల్‌తో పాటు సౌర, జల విద్యుత్, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ సామర్థ్యాలను పెంచుతామన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల వృద్ధికి నిరంతర విద్యుత్ సరఫరానే కీలకమని పేర్కొన్నారు.

**ఫిర్యాదు చేస్తే 'పవర్ అంబులెన్స్'**

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ సేవతో పాటు 'పవర్ అంబులెన్స్' వ్యవస్థను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సిబ్బందితో సమస్య ఉన్న ప్రాంతానికి వెంటనే చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసే విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామని, ప్రతి ఉద్యోగికి రూ. కోటి ప్రమాద బీమా కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్, ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ 'నాలెడ్జ్' బంధం!



తెలంగాణ బ్యూరో , ఆగస్టు 22 (మన విశ్వం): ప్రపంచ ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో విద్య, పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో భాగస్వామ్యానికి తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి విజ్ఞాన, పరిశోధన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంబ్రిడ్జ్ విద్యావేత్తలతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం విస్తృతంగా చర్చించింది. తెలంగాణలో విద్య, పరిశోధన రంగాల్లో ఉన్న అవకాశాలతోపాటు హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి విద్యాసంస్థల విస్తరణకు అనుకూల పరిస్థితులను సీఎం వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కేంబ్రిడ్జ్ ప్రతినిధులను ఆహ్వానించారు.

**పరిశోధన నుంచి స్టార్టప్‌ల దాకా..**

హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాల నిర్వహణ, సంయుక్త పరిశోధనలు, యువ పారిశ్రామికవేత్తల ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి పరస్పర సహకారంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఇందుకు సంబంధించి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగాలని ఇరువర్గాలు అంగీకరించాయి.

కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్లు జైదీప్ ప్రభు, వెంకట సిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలపై వారు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొంది. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. కేంబ్రిడ్జ్‌తో ప్రతిపాదిత భాగస్వామ్యం కార్యరూపం దాల్చితే హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్య, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న 'తెలంగాణ రైజింగ్' లక్ష్యానికి మరింత ఊతం లభించనుంది.

# ఖాకీపై 'ఖద్దర్' పెత్తనం!

(మొదటిపేజీ తరువాయి)

కలిగిస్తున్నాయి. రాజకీయ పెద్దల మాటకు తలూపితే కీలక పోస్టింగ్.. 'చట్టమే ముఖ్యం' అంటే స్థానచలనం అన్న పరిస్థితులు ఉంటే పోలీసు వ్యవస్థ స్వతంత్రతకు అర్థమేంటన్న ప్రశ్న తలెత్తుతోంది. దీంతో కొందరు అధికారులు ఇష్టం లేకున్నా ఒత్తిళ్లకు తలొగ్గుతుండగా.. మరికొందరు 'ఉద్యోగం ఎక్కడైనా చేస్తాం.. చట్టాన్ని మాత్రం వదలం ' అన్న వైఖరితో ముందుకెళ్తున్నట్లు సమాచారం. నిజాయతీగా పనిచేసే అధికారికి బదిలీనే బహుమతిగా మారితే.. నిబంధనలకు కట్టుబడి పనిచేసే ధైర్యం ఎంతమందికి ఉంటుందన్న చర్చ సాగుతోంది.

**స్టేషన్‌లోనూ 'ఖద్దర్' హుకుం!**

రాజకీయ జోక్యం ప్రజాప్రతినిధులతోనే ఆగడం లేదన్న విమర్శలు మరింత తీవ్రంగా వినిపిస్తున్నాయి. నేతల పేర్లు చెప్పుకొనే అనుచరులు సైతం పోలీస్‌స్టేషన్లలో హడావుడి చేస్తూ.. 'మా ఎమ్మెల్యే మనిషిని.. మా నాయకుడు ఫోన్ చేస్తారు' అంటూ కేసుల విషయంలో ఒత్తిళ్లు తెస్తున్నారనే ఆరోపణలున్నాయి. కేసు నమోదు నుంచి దర్యాప్తు వరకు.. నిందితుల విషయంలో వ్యవహరించే తీరు నుంచి అధికారుల పోస్టింగ్‌ల వరకు రాజకీయ సిఫార్సులే ప్రభావం చూపితే సామాన్యుడికి న్యాయం ఎక్కడ దొరుకుతుంది.రాజకీయ పలుకుబడి ఉన్నవాడికి ఒక న్యాయం.. ఏ అండాదండా లేని పౌరుడికి మరో న్యాయం అన్న భావన ఏర్పడితే పోలీసు వ్యవస్థపై ప్రజల విశ్వాసమే దెబ్బతింటుంది.

**పోస్టింగ్‌లపై రాజకీయ ముద్రకు అడ్డుకట్టేదీ?**

ఎవరు ఎక్కడ పనిచేయాలి? ఎవరిని కొనసాగించాలి? ఎవరిని బదిలీ చేయాలి?అన్నదీ రాజకీయ నేతల అభీష్టం మేరకే నిర్ణయమవుతోందన్న ఆరోపణలు పోలీసు వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి. రాజకీయ సిఫార్సుతో పోస్టింగ్ పొందిన అధికారి.. రేపు అదే నేత నుంచి వచ్చే ఒత్తిడిని ఎంతవరకు తిరస్కరించగలరన్నది కీలక ప్రశ్న. దీనికితోడు ప్రజాప్రతినిధుల వ్యక్తిగత, ప్రైవేటు కార్యక్రమాల్లోనూ పోలీసులను ఎస్కార్ట్‌లుగా వినియోగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రజల శాంతిభద్రతలకు వినియోగించాల్సిన ' ఖాకీ 'ని రాజకీయ దర్పానికి ప్రతీకగా మార్చడం తగదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోస్టింగ్‌లు, బదిలీలకు పనితీరు, సమర్థత, పరిపాలనా అవసరాలే ప్రామాణికం కావాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

**ఖాకీ చేతులు కట్టేస్తే.. నేరాలకు కళ్లెం ఎలా?**

పోలీసులకు చట్టబద్ధంగా పనిచేసే స్వేచ్ఛ ఇవ్వకుండా నేరాలను అరికట్టాలని ఆశించడం ఎలా సాధ్యమన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నేరం చేసిన వ్యక్తి అధికారపక్షమైనా.. ప్రతిపక్షమైనా.. ఎంతటి పలుకుబడి ఉన్నవాడైనా చట్టం ముందు ఒక్కటే కావాలి. ఫోన్‌కాల్‌తో కేసు ఆగకూడదు.. సిఫార్సుతో దర్యాప్తు దారి మారకూడదు.. రాజకీయ ఒత్తిడితో నిజాయతీ అధికారి బదిలీ కాకూడదు. ఈ పరిస్థితులకు ముఖ్యమంత్రి స్థాయిలోనే ' కత్తెర ' పడాలన్న డిమాండ్ వినిపిస్తోంది.ఖద్దర్ కు గౌరవం ప్రజలు ఇచ్చిన అధికారం వల్ల.. ఖాకీ కి అధికారం చట్టం అప్పగించిన భాధ్యత వల్ల. రెండింటికీ హద్దులున్నాయి.ఆ హద్దులు చెరిగితే నష్టపోయేది పోలీస్ అధికారి మాత్రమే కాదు.. చివరకు న్యాయం కోసం స్టేషన్ మెట్లెక్కే సామాన్యుడే!

# తప్పిస్తారా?.. తప్పుకునేలా చేస్తారా?

**తెలంగాణ బ్యూరో, ఆగస్టు 22 (మన విశ్వం):** వ్యాఖ్యలు చేసింది కుమార్తె.. రాజకీయ వేడి మాత్రం తల్లిని చుట్టుముడుతోంది! మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదం.. ఇప్పుడు సురేఖ రాజకీయ భవితవ్యంపై చర్చకు దారితీసింది. సొంత పార్టీ ఎమ్మెల్యేలే వరుసగా ప్రెస్‌మీట్లు పెట్టి సురేఖ తీరును తప్పుబట్టడం, కొందరు పార్టీ నుంచి వెళ్లిపోవాలన్నట్లుగా మాట్లాడటం, మరికొందరు మంత్రి పదవికి రాజీనామా చేయాలనే స్థాయిలో వ్యాఖ్యలు చేయడంతో కాంగ్రెస్‌లో ఏం జరుగుతోందన్న చర్చ జోరందుకుంది.

**కూతురు మాట్లాడితే.. తల్లిపై గురి?**

ఈ మొత్తం వ్యవహారంలో ప్రధానంగా వినిపిస్తున్న ప్రశ్న ఇదే. వివాదానికి కారణమైన వ్యాఖ్యలు సుస్మిత పటేల్ చేస్తే.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆగ్రహం మాత్రం కొండా సురేఖపై ఎందుకు మళ్లుతోందని ఆమె అభిమానులు ప్రశ్నిస్తున్నారు. సుస్మిత వ్యాఖ్యలు పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని భావిస్తే ఆమె విషయంలోనే స్పందించాలి తప్ప.. సురేఖను చులకన చేసేలా సొంత పార్టీ నేతలు మాట్లాడటం ఎంతవరకు సమంజసమన్న వాదన వినిపిస్తోంది.

**వరుస ప్రెస్‌మీట్ల వెనుక..?**

ఒకరి తర్వాత మరొకరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మీడియా ముందుకొచ్చి సురేఖపై విమర్శలు చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఇవన్నీ వ్యక్తిగత స్పందనలేనా? లేక సురేఖపై ఒత్తిడి పెంచే ప్రయత్నంలో భాగమా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ నుంచి వెళ్లిపోవాలన్న సంకేతాల నుంచి రాజీనామా డిమాండ్ల వరకు స్వరం పెరగడంతో తప్పిస్తారా?.. లేక తప్పుకునే పరిస్థితి కల్పిస్తారా?' అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో మొదలైంది.

**సుస్మితపై చర్య ఎందుకు కోరడం లేదు?**

పార్టీకి ఇబ్బందికరంగా మారిన వ్యాఖ్యలు సుస్మిత చేసినప్పుడు చర్యలు కూడా ఆమెపైనే ఉండాలి కదా అన్నది కొండా వర్గీయుల వాదన. అందుకు భిన్నంగా సురేఖనే లక్ష్యంగా చేసుకొని ఎమ్మెల్యేలు మాట్లాడటం వెనుక రాజకీయ కారణాలేమైనా ఉన్నాయా? ఇప్పటికే ఉన్న అంతర్గత విభేదాలు ఈ వివాదంతో బయటపడుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**'వేటు' ప్రచారంతో వేడెక్కిన రాజకీయం**

ఒకవైపు కుమార్తె వ్యాఖ్యలు.. మరోవైపు తల్లిపై సొంత పార్టీ నేతల విమర్శలు.. ఇంకోవైపు మంత్రి పదవి, పార్టీ భవిష్యత్తుపై ఊహాగానాలు. మొత్తంగా' కూతురు వ్యాఖ్యలు -తల్లిపై వేటు' వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నదే ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.

# 'నాపై గురిపెట్టిన ఆ అదృశ్య హస్తమెవరిది?'

హైదరాబాద్, ఆగస్టు 22 (మన విశ్వం): కాంగ్రెస్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మరోసారి స్పందించారు. తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు వరుసగా చేస్తున్న వ్యాఖ్యల వెనుక ఎవరున్నారో తేల్చాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీని కోరారు. నేతలంతా దాదాపు ఒకే స్వరంతో, ఒకే తరహా ఆరోపణలు చేస్తుండటం యాదృచ్ఛికమా? లేక తెరవెనుక ఎవరైనా వారిని నడిపిస్తున్నారా? అనే అనుమానాలను ఆమె వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలోని సూత్రధారులను గుర్తించి పార్టీ నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని కమిటీ ఛైర్మన్ మల్లు రవికి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు.

**ఒకే మాట.. ఎవరి బాట?**

క్రమశిక్షణ కమిటీ నోటీసుకు ఇప్పటికే వివరణ సమర్పించానని, పార్టీ నాయకత్వం, క్రమశిక్షణా వ్యవస్థపై తనకు పూర్తి గౌరవం ఉందని సురేఖ పేర్కొన్నారు. అయితే విచారణ కొనసాగుతుండగానే పలువురు నేతలు మీడియా ముందుకొచ్చి తనతోపాటు కుటుంబ సభ్యులనూ లక్ష్యంగా చేసుకోవడంపై అభ్యంతరం తెలిపారు. వారి వ్యాఖ్యల్లో ఒకే తరహా ధోరణి కనిపిస్తోందని, దీని వెనుక ఎవరైనా ప్రేరేపిస్తున్నారా? సమన్వయం చేస్తున్నారా? అనే అంశాన్ని పరిశీలించాలని కోరారు.

**విచారణకు ముందే 'తీర్పు'లా?**

తనపై చర్యలు తీసుకోవాలని కొందరు నేతలు బహిరంగంగా డిమాండ్ చేయడంతోపాటు తన రాజకీయ భవిష్యత్తుపైనా వ్యాఖ్యలు చేయడాన్ని సురేఖ ప్రశ్నించారు. క్రమశిక్షణ కమిటీ విచారణ పూర్తికాకముందే ఇలాంటి ప్రకటనలు చేయడం సమంజసమేనా? అవి కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నాలా? అనే కోణంలోనూ పరిశీలించాలని కోరారు.

**'మాట్లాడేవారే కాదు.. మాట్లాడిస్తున్నదెవరు?'**

కాంగ్రెస్ సామాజిక న్యాయం, మహిళా సాధికారత, బలహీనవర్గాల ఆత్మగౌరవానికి కట్టుబడిన పార్టీ అని సురేఖ గుర్తుచేశారు. అలాంటి పార్టీలో సీనియర్ బీసీ మహిళా నాయకురాలైన తనపై వరుసగా తీవ్ర వ్యాఖ్యలు రావడంపై ఆవేదన వ్యక్తం చేశారు.తనపై మాట్లాడుతున్న వారితోపాటు వారిని మాట్లాడిస్తున్న వారెవరైనా ఉంటే వారిని గుర్తించాలని, తెరవెనుక సూత్రధారుల పాత్ర తేలితే పార్టీ క్రమశిక్షణా నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని మల్లు రవిని కోరారు.

## నాయి బ్రాహ్మణుల వృత్తి హక్కులను కాపాడాలి

**- తెలంగాణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయగిరి సమ్మయ్య డిమాండ్**



మల్హర్, ఆగస్టు22(మన విశ్వం): నాయి బ్రాహ్మణుల కులవృత్తిని మరియు వారి హక్కులను కాపాడేలా ప్రభుత్వం వెంటనే రక్షణ జీవో విడుదల చేయాలని తెలంగాణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయగిరి సమ్మయ్య డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలం ఎడ్లపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలో నాయి బ్రాహ్మణులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. తరతరాలుగా గ్రామీణ ప్రాంతాలలో కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్న తమకు, ఆ వృత్తి తమ జన్మహక్కు అని స్పష్టం చేశారు. వేరే కులస్థులు ఈ వృత్తిని చేపట్టకుండా చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక నాయి బ్రాహ్మణ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాయి బ్రాహ్మణుల అభివృద్ధి కోసం ప్రతి జిల్లాలో అధునాతన బ్యూటీ పార్లర్ ట్రైనింగ్ ఇప్పించాలని, అలాగే ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేయాలని కోరారు. గత ప్రభుత్వం పదేళ్ల పరిపాలనలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించిన ఆయన, ప్రస్తుత గౌరవ ముఖ్యమంత్రి నాయి బ్రాహ్మణుల సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పీఎం శ్రీ పాఠశాలల్లో నాణ్యతకు ప్రాధాన్యం




**- పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం**
**- విద్యార్థుల భద్రత, సైబర్ అవగాహనపై ప్రత్యేక దృష్టి**
**- నెలవారీగా ఉత్తమ కార్యక్రమాల ప్రదర్శన**
**- సమగ్ర అభివృద్ధికి వినూత్న కార్యాచరణ**

నారాయణపేట, ఆగస్టు 22 (మన విశ్వం): పీఎం శ్రీ పాఠశాలలను జిల్లాలో ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. విద్యా ప్రమాణాల పెంపుతో పాటు విద్యార్థుల భద్రత, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక అక్షరాస్యత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని 19 పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల నెలవారీగా తాము చేపట్టిన ఉత్తమ కార్యక్రమాలు, వాటి ఫలితాలు, విద్యార్థుల్లో వచ్చిన మార్పులు, భవిష్యత్ కార్యాచరణను ప్రదర్శించే విధంగా ప్రత్యేక ప్రజెంటేషన్లు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి నెల నిర్వహించే సమీక్ష సమావేశాల్లో పాఠశాలలు తమ విజయవంతమైన కార్యక్రమాలను ఇతర పాఠశాలలతో పంచుకోవడం ద్వారా మంచి పద్ధతులను విస్తరించవచ్చని తెలిపారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రతి పాఠశాల వినూత్న కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని పేర్కొన్నారు.

బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గుడ్ టచ్--బ్యాడ్ టచ్ అంశంపై వచ్చే వారంలోనే ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అవసరమైతే నిపుణులను పాఠశాలలకు ఆహ్వానించి ప్రదర్శనాత్మకంగా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులను తరగతుల వారీగా విభజించి భద్రతా అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే చిన్న వయస్సు నుంచే పొదుపు అలవాట్లు పెంపొందించేందుకు పిగ్గీ బ్యాంక్ కార్యక్రమాలు నిర్వహించాలని, డబ్బు విలువ, ఆర్థిక నిర్వహణ, పొదుపు ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో చట్ట విజ్ఞానం, సైబర్ సేఫ్టీ, స్వీయ రక్షణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. స్థానిక పోలీసు శాఖ, సైబర్ విభాగం అధికారులతో సమన్వయం చేసుకుని విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, బాలల హక్కులు, సంబంధిత చట్టాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అవసరమైన చోట స్థానిక ఎస్ఐలు, సైబర్ నిపుణులను పాఠశాలలకు ఆహ్వానించి ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డిజిటల్ యుగంలో విద్యార్థులు భద్రంగా ఉండేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.పీఎం శ్రీ పాఠశాలలకు ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో వినియోగించాలని కలెక్టర్ సూచించారు. గ్రీనరీ అభివృద్ధి, పాఠశాలల సుందరీకరణ, క్లబ్బుల ఏర్పాటు, గ్రంథాలయాల అభివృద్ధి, కళలు, చేతిపనుల కార్యక్రమాలకు అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేయాలని తెలిపారు. నిధులు ఖర్చు చేయడమే కాకుండా వాటి ద్వారా విద్యార్థులకు కలిగిన ప్రయోజనాలు, సాధించిన ఫలితాలను నెలవారీ నివేదికల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రతి పాఠశాల ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బేస్‌లైన్ సర్వే ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విజువల్ లెర్నింగ్, ప్రయోగాత్మక బోధన, ఆధునిక విద్యా పద్ధతులను ఉపయోగించి పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధించాలని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థుల సామర్థ్యాలను మరింత పెంపొందించే చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, పీఎం శ్రీ పాఠశాలలు విద్యా ప్రమాణాలు, భద్రత, నైపుణ్యాభివృద్ధి, ఆత్మవిశ్వాసం, సాంకేతిక అవగాహనలో ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.

## డీఎన్ఏ మడతల్లోనూ గుండె జబ్బుల రహస్యం




మన శరీరంలోని ప్రతి కణానికి అవసరమైన జన్యు సూచనలను డీఎన్ఏ అందిస్తుంది. జన్యువుల్లో మార్పులే వ్యాధులకు ప్రధాన కారణమని ఇప్పటివరకు భావించినప్పటికీ, డీఎన్ఏ కణంలో ఎలా మడతపడి, త్రీడీ ఆకృతిలో ఎలా అమరిక అయి ఉంటుందన్న అంశం కూడా కీలకమని తాజా పరిశోధన వెల్లడించింది. ముఖ్యంగా పుట్టుకతో వచ్చే గుండె లోపాలపై ఇది కొత్త అవగాహనను అందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 100 మంది శిశువుల్లో సుమారు ఒకరికి పుట్టుకతో వచ్చే గుండె లోపం కనిపిస్తోంది. గుండె అభివృద్ధిలో కీలకమైన టీబీఎక్స్5 జన్యువులో మార్పులు కూడా ఇందుకు కారణమవుతాయి. ఈ జన్యువు రెండు ప్రతుల్లో ఒకటి మాత్రమే పనిచేసినప్పుడు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎందుకు వస్తాయన్న ప్రశ్నకు తాజా అధ్యయనం సమాధానం సూచిస్తోంది.స్టెమ్ కణాలను గుండె కండర కణాలుగా మార్చి.. పరిశోధకులు మానవ స్టెమ్ కణాలను గుండె కండర కణాలుగా మార్చి, టీబీఎక్స్5 రెండు ప్రతులు ఉన్న కణాలతోపాటు ఒకటి లేదా రెండూ లేని కణాలను పరిశీలించారు. అత్యాధునిక త్రీడీ మ్యాపింగ్, కంప్యూటర్ నమూనాల ద్వారా డీఎన్ఏ నిర్మాణాన్ని విశ్లేషించారు. టీబీఎక్స్5 లోపంతో డీఎన్ఏలోని పెద్ద విభాగాలు, ప్రత్యేక ప్రాంతాలు, క్రోమాటిన్ లూప్‌లు సహా మొత్తం నిర్మాణం గణనీయంగా మారినట్లు గుర్తించారు. టీబీఎక్స్5, కోహెసిన్ మాలిక్యులర్ మోటార్‌ను డీఎన్ఏలోని సరైన ప్రాంతాలకు చేర్చడంలో సహాయపడుతుంది. దీంతో జన్యువులు, వాటిని నియంత్రించే ప్రాంతాలు దగ్గరై అవసరమైన జన్యు సూచనలు సరైన సమయంలో పనిచేస్తాయి. టీబీఎక్స్5 స్థాయి సగానికి తగ్గినా ఈ లూప్‌ల నిర్మాణం దెబ్బతిని గుండె అభివృద్ధికి అవసరమైన జన్యువుల పనితీరుపై ప్రభావం పడుతున్నట్లు అధ్యయనం సూచించింది.

డీఎన్ఏ మడతలను సరిచేస్తే..

అదే జన్యు లోపానికి గుండెలోని వివిధ కణాలు భిన్నంగా స్పందించడం, వ్యక్తుల మధ్య గుండె లోపాల తీవ్రత ఎందుకు మారుతుందో వివరించడంలోనూ ఈ పరిశోధన ఉపయోగపడనుంది. భవిష్యత్తులో ఇతర పుట్టుకతో వచ్చే వ్యాధుల్లోనూ డీఎన్ఏ త్రీడీ నిర్మాణం పాత్రను పరిశీలించనున్నారు. డీఎన్ఏ మడతలను మారనుంది.

# రాజ్యాంగం భారత ముస్లింలు: బలమైన దేశ నిర్మాణంలో ఒక సమిష్టి ప్రయాణం




భారత రాజ్యాంగాన్ని దేశ అత్యున్నత చట్టంగా అభివర్ణిస్తారు. అయితే రాజ్యాంగం కేవలం ఒక న్యాయపరమైన పత్రం మాత్రమే కాదు. మతం, కులం, భాష, ప్రాంతం అనే భేదాలు లేకుండా ప్రతి భారతీయుడికి సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన ఒక పవిత్ర హామీ. భారత ముస్లింలకు రాజ్యాంగం కేవలం చట్టపరమైన రక్షణను కల్పించే వ్యవస్థ మాత్రమే కాదు. తమ మత విశ్వాసాలను స్వేచ్ఛగా ఆచరిస్తూనే దేశ జీవనంలో, అభివృద్ధిలో సంపూర్ణంగా భాగస్వాములు కావడానికి అది ఒక బలమైన పునాది.

ప్రపంచంలోనే అత్యధిక ముస్లిం జనాభా ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. శతాబ్దాలుగా భారతీయ ముస్లింలు దేశ సంస్కృతి, విద్య, వాస్తుశిల్పం, సాహిత్యం, వాణిజ్యం, స్వాతంత్ర్యోద్యమానికి విశేషమైన సేవలు అందించారు. స్వాతంత్ర్యం అనంతరం న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువలపై ఏర్పడిన ప్రజాస్వామ్య గణతంత్రంలో వారు సమాన హక్కులు కలిగిన పౌరులుగా మారారు. రాజ్యాంగం చట్టం ముందు సమానత్వాన్ని హామీ ఇస్తూ, మత ప్రాతిపదికన వివక్షను నిషేధిస్తుంది. ప్రతి ఒక్కరికీ తమ మతాన్ని స్వేచ్ఛగా ఆచరించే, ప్రకటించే హక్కును కల్పించడంతో పాటు మైనారిటీల సాంస్కృతిక, విద్యా హక్కులను కూడా రక్షిస్తుంది.

భారతదేశ బలం దాని వైవిధ్యంలోనే ఉందని రాజ్యాంగ నిర్మాతలు విశ్వసించారు. భిన్న మతాలు, సంప్రదాయాలకు చెందిన ప్రజలు ఒకే రాజ్యాంగ వ్యవస్థ కింద శాంతియుతంగా కలిసి జీవించగలరని వారు గుర్తించారు. అందుకే రాజ్యాంగంలోని ఈ హామీలు ముస్లింలకు భరోసాతో పాటు బాధ్యతను కూడా గుర్తుచేస్తాయి. ప్రతి ముస్లిం భారతదేశ భవిష్యత్తులో సమాన భాగస్వామి అనే విషయాన్ని అవి స్పష్టం చేస్తున్నాయి.అదే సమయంలో పౌరసత్వం అంటే కేవలం హక్కులను కోరుకోవడం మాత్రమే కాదని, బాధ్యతలను కూడా నిర్వర్తించడం అని గుర్తించాలి. చట్టాన్ని గౌరవించే, ప్రజాజీవితంలో భాగస్వాములయ్యే, సమాజానికి సానుకూలంగా సేవ చేసే పౌరులపైనే బలమైన ప్రజాస్వామ్యం ఆధారపడి ఉంటుంది. ఈ భావన ఇస్లామిక్ బోధనలకు కూడా అనుగుణంగా ఉంటుంది. ఖురాన్ న్యాయాన్ని పాటించాలని, సత్యాన్ని పలకాలని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, ప్రతి ఒక్కరితో న్యాయంగా వ్యవహరించాలని బోధిస్తుంది. ప్రవక్త మహ్మద్ తన జీవితంలో నిజాయితీ, కరుణ, సామాజిక బాధ్యత, శాంతియుత సహజీవనం యొక్క ప్రాధాన్యతను చాటిచెప్పారు.ఈ విలువలు రాజ్యాంగంలోని న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి ఆదర్శాలతో సహజంగా అనుసంధానమవుతాయి. ఒక వ్యక్తి ముస్లింగా ఉండటం, బాధ్యతాయుతమైన భారతీయ పౌరుడిగా ఉండటం పరస్పర విరుద్ధమైన విషయాలు కావు. అవి ఒకదానినొకటి మరింత బలోపేతం చేస్తాయి.దేశభక్తిని కేవలం నినాదంగా లేదా ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వ్యక్తం చేసే భావోద్వేగంగా చూడకూడదు. నిజమైన దేశభక్తి మన రోజువారీ చర్యల్లో ప్రతిబింబించాలి. పిల్లలకు మంచి విద్య అందించడం, చట్టాలను గౌరవించడం, ప్రజా ఆస్తులను కాపాడడం, పొరుగువారికి సహాయం చేయడం, ఇతర మతాల వారిని గౌరవించడం, నిజాయితీగా పన్నులు చెల్లించడం, ఎంచుకున్న వృత్తిలో నిబద్ధతతో పనిచేయడం వంటి చర్యలే నిజమైన దేశసేవకు ప్రతీకలు.యువతకు జ్ఞానాన్ని అందించే ప్రతి ఉపాధ్యాయుడు, కరుణతో రోగులకు సేవ చేసే ప్రతి వైద్యుడు, ఉపాధి అవకాశాలను సృష్టించే ప్రతి పారిశ్రామికవేత్త, ప్రతిభను చాటేందుకు కృషి చేసే ప్రతి విద్యార్థి దేశ ప్రగతికి తనవంతు సహకారం అందిస్తున్నాడు.భారతీయ ముస్లింలు దేశం పట్ల తమ నిబద్ధతను ఎన్నో సందర్భాల్లో నిరూపించారు. సాయుధ దళాలు, న్యాయవ్యవస్థ, సివిల్ సర్వీసులు, విజ్ఞానశాస్త్రం, వైద్యం, క్రీడలు, వ్యాపారం, విద్య, కళలు తదితర రంగాల్లో వారు విశిష్ట సేవలు అందించారు. వారి విజయాలు దేశ అభివృద్ధిలో ప్రతి సమాజం విశ్వాసంతో, సంకల్పంతో భాగస్వాములైనప్పుడే జాతీయ ప్రగతి మరింత బలపడుతుందని గుర్తుచేస్తున్నాయి.

అయితే నేటి తరం కొత్త సవాళ్లను కూడా ఎదుర్కొంటోంది. సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచారం, ద్వేషపూరిత ప్రచారం, పుకార్లు అత్యంత వేగంగా వ్యాపిస్తున్నాయి. విభజనకు దారితీసే కథనాలు సమాజంలో భయం, అపనమ్మకాలను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి. అందువల్ల ఏ సమాచారాన్నైనా నమ్మే ముందు లేదా ఇతరులతో పంచుకునే ముందు దాని నిజానిజాలను పరిశీలించాలి. దాని వల్ల సమాజంపై కలిగే ప్రభావాన్ని కూడా ఆలోచించాలి. విభజనలను మరింతగా పెంచేవారికంటే, ప్రజల మధ్య వారధులు నిర్మించేవారిదే భవిష్యత్తు.

ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవాలి. ప్రజాస్వామ్య సంస్థల్లో భాగస్వామి కావాలి. సమాజంతో నిర్మాణాత్మకంగా కలిసి పనిచేయాలి. జ్ఞానం విశ్వాసాన్ని పెంచుతుంది. విశ్వాసం సమాజాలు దేశ ప్రగతికి మరింత సమర్థవంతంగా తోడ్పడేలా చేస్తుంది.భారతదేశ వైవిధ్యం దేశానికి ఉన్న గొప్ప బలాల్లో ఒకటి. వివిధ మతాలు, భాషలు, సంస్కృతులకు చెందిన ప్రజలు శతాబ్దాలుగా ఇక్కడ కలిసి జీవిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు సహజం. అయితే వాటిని చర్చ, రాజ్యాంగబద్ధమైన మార్గాలు, పరస్పర గౌరవం ద్వారా పరిష్కరించాలి. ప్రజలు తమ సమస్యలను వ్యక్తం చేయడానికి, న్యాయం కోరడానికి, సానుకూల మార్పు తీసుకురావడానికి రాజ్యాంగం శాంతియుతమైన మార్గాలను అందిస్తుంది.

బాధ్యతాయుతమైన పౌరసత్వానికి ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం అవసరం. రాజ్యాంగంలోని ప్రాథమిక విధులు ప్రతి పౌరుడు సామరస్యాన్ని పెంపొందించాలని, దేశ సమైక్యతను కాపాడాలని, భారతదేశ గొప్ప వారసత్వాన్ని పరిరక్షించాలని, శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవాలని, పర్యావరణాన్ని రక్షించాలని సూచిస్తున్నాయి. ఇవి ఏ ఒక్క సమాజానికి మాత్రమే సంబంధించిన బాధ్యతలు కావు. దేశాన్ని సమగ్రంగా బలోపేతం చేసే ఉమ్మడి బాధ్యతలు. 21వ శతాబ్దంలో భారత్ ముందుకు సాగుతున్న నేపథ్యంలో ప్రతి సమాజం భాగస్వామ్యం దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. విద్య, పారిశ్రామిక రంగం, ప్రజాసేవ, సామాజిక సేవ, నూతన ఆవిష్కరణలలో భారతీయ ముస్లింలకు అపారమైన సామర్థ్యం ఉంది. ఈ రంగాల్లో పెట్టుబడులు పెంచుతూ, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలను గౌరవిస్తే జాతీయ అభివృద్ధికి వారు మరింత గొప్పగా తోడ్పడగలరు.

రాజ్యాంగం ఎవరినీ తమ మతపరమైన గుర్తింపును వదులుకోవాలని కోరదు. ప్రతి మతానికి చెందిన ప్రజలు గౌరవంతో జీవిస్తూ, ఒకే జాతీయ గుర్తింపుతో ముందుకు సాగేందుకు రాజ్యాంగం అవకాశం కల్పిస్తుంది. న్యాయం, నిజాయితీ, కరుణ, సేవ వంటి ఇస్లామిక్ విలువలకు కట్టుబడి ఉంటూనే రాజ్యాంగాన్ని గౌరవించడం ద్వారా భారతీయ ముస్లింలు మరింత ఐక్యమైన, సమగ్ర, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలరు.

**అల్తాఫ్ మీర్**
**పీహెచ్.డి., జామియా మిలియా ఇస్లామియా**

## సోదరభావంతో మిలాద్-ఉన్-నబీ జరుపుకోవాలి

**- శాంతియుత వేడుకలకు సీపీ రష్మి పెరుమాళ్ పిలుపు**
**- మత పెద్దలు, ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశం**
**- పరస్పర గౌరవంతో పండుగ నిర్వహించాలని సూచన**
**- పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తామని హామీ**



సిద్దిపేట, ఆగస్టు 22 (మన విశ్వం): మిలాద్-ఉన్-నబీ పండుగను శాంతియుత, ప్రశాంత వాతావరణంలో సోదరభావంతో జరుపుకోవాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ రష్మి పెరుమాళ్ పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట ఏసీపీ కార్యాలయంలో స్థానిక ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులతో ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఊరేగింపుల మార్గాలు, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమాజంలో శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సీపీ పేర్కొన్నారు. మిలాద్-ఉన్-నబీ ప్రవక్త మహమ్మద్ బోధించిన ప్రేమ, కరుణ, మానవతా విలువలను గుర్తు చేసే పవిత్ర సందర్భమని అన్నారు. ఈ పండుగను పరస్పర గౌరవంతో, మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకుండా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. పండుగ సందర్భంగా నిర్వహించే ఊరేగింపులు, ప్రార్థనా కార్యక్రమాలు, ఇతర వేడుకలు నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం జరగాలని తెలిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు, అసత్య ప్రచారాలను ఎవరూ ప్రోత్సహించవద్దని హెచ్చరించారు. మత సామరస్యానికి భంగం కలిగించే చర్యలను పోలీసులు ఉపేక్షించరని స్పష్టం చేశారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని మత పెద్దలకు సూచించారు.

సమావేశంలో పాల్గొన్న ముస్లిం మత పెద్దలు, శాంతి కమిటీ సభ్యులు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం పెంపొందించే విధంగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పోలీసు శాఖ సూచనలను పాటిస్తూ వేడుకలను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. పండుగ సమయంలో ప్రజల భద్రతకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని సీపీ రష్మి పెరుమాళ్ తెలిపారు. అవసరమైన చోట ప్రత్యేక బందోబస్తు, నిఘా ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. శాంతి, సామరస్యం, పరస్పర గౌరవం సిద్దిపేట ప్రత్యేకతగా నిలవాలని, అందరూ కలిసి పండుగను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

# రౌడీషీటర్లపై నిఘా మరింత పటిష్ఠం

**- నేరం జరిగాక దర్యాప్తు కంటే.. నివారణే కీలకం**
**- డ్రగ్స్ వినియోగదారులు, విక్రేతలపై ప్రత్యేక దృష్టి**
**- పాత నేరస్తుల కదలికలనూ గమనించాలి**
**- సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి**
**- పోలీసు అధికారులకు సీపీ శ్వేత ఆదేశం**

వరంగల్, ఆగస్టు 22 (మన విశ్వం): రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అధికారులను ఆదేశించారు. నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేయడం కంటే.. అది జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే కీలకమని స్పష్టం చేశారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.

ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడితే శాంతిభద్రతల సమస్యలను సులభంగా పరిష్కరించవచ్చన్నారు.




**- డ్రగ్స్‌పై ఉక్కుపాదం**

మత్తు పదార్థాల కారణంగా యువత భవిష్యత్తు అంధకారమవుతోందని సీపీ ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వినియోగదారులను గుర్తించి, వారి ద్వారా విక్రేతల సమాచారాన్ని సేకరించి కట్టడి చేయాలని ఆదేశించారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ సిబ్బందిని నియమించి మత్తు పదార్థాల సరఫరా, వినియోగంపై సమాచారం సేకరించాలన్నారు. గతంలో నేరాలకు పాల్పడి ప్రస్తుతం సమాజంలో జీవిస్తున్న పాత నేరస్తుల కదలికలపైనా కన్నేసి ఉంచాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో ప్రజలు మోసపోకుండా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

అనంతరం పెండింగ్ కేసుల్లో నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతి, కోర్టుల్లోని కేసుల స్థితిగతులతో పాటు పోలీస్‌స్టేషన్ల పనితీరును సీపీ సమీక్షించారు. సమావేశంలో డీసీపీలు అంకిత్‌కుమార్, దారా కవిత, రాజమహేంద్ర నాయక్, కిషన్‌సింగ్, అదనపు డీసీపీలు సురేష్‌కుమార్, బాలస్వామి, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రూ.75 వేల లంచం.. ఏసీబీకి చిక్కిన ఎస్సై!

- ఎస్సైతోపాటు కానిస్టేబుల్‌పైనా ఏసీబీ కేసు
- చందానగర్ ఠాణాలో అవినీతి బాగోతం
- కేసు దర్యాప్తు, చార్జిషీట్ కోసం లంచం డిమాండ్
- ఎస్సైతోపాటు కానిస్టేబుల్‌పైనా ఏసీబీ కేసు
- ఇప్పటికే రూ.30 వేలు తీసుకున్నట్లు అధికారుల వెల్లడి



**హైదరాబాద్, ఆగస్టు 22:** కేసు దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేసేందుకు రూ.75 వేల లంచం తీసుకుంటూ చందానగర్ పోలీస్‌స్టేషన్ ఎస్సై బండెల బాలరాజ్ ఏసీబీకి చిక్కారు. ఈ వ్యవహారంలో కానిస్టేబుల్/రైటర్ బొట్ట రాఘవేంద్ర కుమార్‌పైనా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. చందానగర్ ఠాణాలో నమోదైన క్రైమ్ నంబరు 696/2026 కేసు దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు విషయంలో అనుకూలంగా వ్యవహరించేందుకు ఎస్సై బాలరాజ్ ఫిర్యాదుదారుడిని రూ.75 వేలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. శనివారం ఆ మొత్తాన్ని స్వీకరించగా రంగారెడ్డి రేంజ్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఎస్సై కార్యాలయంలోని టేబుల్ డ్రాయర్ నుంచి రూ.75 వేలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ వ్యవహారంలో ఎస్సై అంతకుముందే రూ.20 వేల నగదు తీసుకున్నారని, కానిస్టేబుల్ రాఘవేంద్ర కుమార్ మరో రూ.10 వేలను యూపీఐ ద్వారా స్వీకరించారని ఏసీబీ వెల్లడించింది. దీంతో మొత్తం రూ. 1.05లక్షలు తీసుకున్నట్లు పేర్కొంది. నిందితులను అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# 22ఏ పేరుతో ప్రజల ఆస్తులపై కన్నేస్తారా?

- 30 ఏళ్లుగా వివాదం లేని ఇళ్లను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు?'
- బోడుప్పల్‌లో 1,500 కుటుంబాలకు 22ఏ చిక్కులు
- 30% కమిషన్ల కోసమే కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపణ
- తక్షణమే నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్
- బాధితుల తరఫున పోరాడతామని హరీశ్‌రావు హెచ్చరిక




**హైదరాబాద్, ఆగస్టు 22(మన విశ్వం) :** నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములు, ఇళ్లపై ఆంక్షలు విధించే హక్కు ప్రభుత్వానికి ఎవరిచ్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రశ్నించారు. బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్‌కు చెందిన వందలాది మంది 22ఏ బాధితులు తమ సమస్యలను వివరించారని తెలిపారు. వారి ఆవేదన కలచివేసిందన్నారు.

సర్వే నంబర్లు 215, 215 పార్టులలో సుమారు 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా దాదాపు 1,500 కుటుంబాలు నివసిస్తున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. అలాంటి ఆస్తులను అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దుర్మార్గమని విమర్శించారు. అవసరాల కోసం ఇల్లు అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లినప్పుడు ఆస్తి నిషేధిత జాబితాలో ఉందని తెలిసి ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగిన ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టించి ప్రజలపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వం '30% కమిషన్ సర్కార్'గా మారిందని విమర్శించారు. 22ఏ పేరుతో భయపెట్టి బినామీల ద్వారా సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బోడుప్పల్ బాధితులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 22ఏ సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు అధైర్యపడొద్దని హరీశ్‌రావు పేర్కొన్నారు. వారి ఆస్తుల పరిరక్షణకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం తక్షణమే సంబంధిత కాలనీలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్పందించకపోతే బాధితుల పక్షాన పెద్దఎత్తున పోరాటం చేపడతామని హెచ్చరించారు.

# అర్జీలు పెండింగ్‌లో పెడితే చర్యలే!

- ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు: పొంగులేటి
- భూభారతి, సాదాబైనామా దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని ఆదేశం
- ఏడాదిన్నరలో భూములు, ఆబాదీ ఆస్తుల రీసర్వే పూర్తి
- ఇందిరమ్మ లబ్ధిదారులకు రూ.230కే సిమెంట్ బ్యాగ్
- నిజామాబాద్‌లో 'ఇందిరమ్మ టవర్స్'కు స్థల పరిశీలన




**నిజామాబాద్, ఆగస్టు 22(మన విశ్వం) :** భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తూ ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదాబైనామా అర్జీల పరిష్కారంలో జాప్యంపై తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోని అధికారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన మంత్రి.. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, రిజిస్ట్రేషన్లు, సర్వే శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే రీసర్వే చేపట్టామని, వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల సర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పొంగులేటి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ వ్యయాన్ని తగ్గించేందుకు లబ్ధిదారులకు సిమెంట్ బ్యాగును రూ. 230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సొంత స్థలంలేని పట్టణ పేదల కోసం 'ఇందిరమ్మ టవర్స్' నిర్మిస్తామని, నిజామాబాద్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టేందుకు నాగారంలో స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన మంత్రి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం 400 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలు అందజేశారు. మరో వారం, పది రోజుల్లో 300 మందికి ఇళ్లు అందిస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు అందే వరకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# రోడ్లు, వంతెనల పనుల్లో వేగం పెంచాలి

- సీఆర్ఐఎఫ్, సేతుబంధన్ పనులపై సమీక్ష
- నియోజకవర్గాల వారీగా పురోగతి మెరుగుపరచాలని ఆదేశం
- సచివాలయంలో సోలార్ పార్కింగ్ పనులకు గడువు
- నంది పహాడ్ వంతెన వెంటనే ప్రారంభించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచన



**హైదరాబాద్, ఆగస్టు 22 (మన విశ్వం):** రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న సీఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్ వంతెనలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి శాఖ పనుల పురోగతిని విస్తృతంగా పరిశీలించారు. రాష్ట్ర అభివృద్ధికి రహదారులే కీలకమని పేర్కొంటూ ప్రతి పనిని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా జరుగుతున్న పనుల స్థితిగతులను పరిశీలించిన మంత్రి, క్షేత్రస్థాయిలో అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ కార్ పార్కింగ్ పనులపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్తరం, దక్షిణం, పడమర వైపులా ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాజెక్టు పనులను 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సుమారు రూ.26.81 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే సచివాలయ అవసరాలకు నెలకు 90 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. దీనివల్ల నెలవారీ విద్యుత్ బిల్లులో దాదాపు 16 శాతం వరకు ఆదా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భవనం అందాన్ని దెబ్బతీయకుండా ఆధునిక నమూనాలో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు సీఆర్ఐఎఫ్ పథకం కింద 3,918 కిలోమీటర్ల రహదారులకు రూ.5,159 కోట్లతో 316 పనులు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. వీటిలో అనేక పనులు చివరి దశకు చేరుకోగా, మరికొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.868 కోట్లతో చేపట్టిన 422.36 కిలోమీటర్ల రహదారి పనుల పురోగతి సంతృప్తికరంగా ఉందని అధికారులను అభినందించారు. అయితే ప్రజలకు మరింత మెరుగైన రహదారులు అందించాలంటే పనుల్లో వేగం, నాణ్యత రెండూ సమానంగా ఉండాలని స్పష్టం చేశారు. సేతుబంధన్ పథకం కింద నిర్మిస్తున్న వంతెనల పురోగతిపైనా మంత్రి సమీక్ష నిర్వహించారు. రూ.76 కోట్లతో నిర్మిస్తున్న నార్కట్‌పల్లి వంతెన పనులు వేగంగా కొనసాగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మిర్యాలగూడ, నంది పహాడ్ ప్రాంతాల్లో చేపట్టనున్న వంతెన పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సాంకేతిక అనుమతులు, భూసేకరణ వంటి అంశాలను త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం పెంచి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణంపై కూడా మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే పురోగతిలో ఉన్న ఆర్‌ఓబీ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలస్యాల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తుచేస్తూ పనుల పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. కరీంనగర్, మెదక్, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, వికారాబాద్, నిజామాబాద్, సిద్ధిపేట, మహబూబాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో జరుగుతున్న పనులపై అధికారులు వివరాలు అందించారు. ప్రతి జిల్లాలో పురోగతి నివేదికలను క్రమం తప్పకుండా సమీక్షిస్తామని మంత్రి తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. రహదారులు, వంతెనలు, ఆర్‌ఓబీలు సమయానికి పూర్తైతే రవాణా వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు ప్రాంతీయ అభి వృద్ధికి ఊతమిస్తాయని పేర్కొన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో మరింత శ్రద్ధతో పని చేసి ప్రభుత్వ లక్ష్యాలను సాకారం చేయాలని సూచించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని హెచ్చరిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి కొనసాగుతుందని తెలిపారు.

# ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను పిల్లలకు ఇవ్వకండి.. నిపుణుల హెచ్చరిక..

ఇటీవలి కాలంలో ఈ-బైక్‌లు, ఈ-స్కూటర్లు వంటి విద్యుత్ ఆధారిత ద్విచక్ర వాహనాల వినియోగం విపరీతంగా పెరిగింది. యువత నుంచి డెలివరీ సిబ్బంది వరకు వీటిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. అయితే వీటి వినియోగం పెరుగుతున్న కొద్దీ, ముఖ్యంగా పిల్లలు ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడటం, మరణాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఈ-బైక్‌ల వినియోగంపై కఠినమైన నిబంధనలు తీసుకురావాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. పిల్లలు ఈ-బైక్‌లు, ఈ-స్కూటర్లు, ఇతర విద్యుత్ వాహనాలతో ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో అధికారులు తల్లిదండ్రుల బాధ్యతపైనా దృష్టి సారిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ పిల్లలు ఈ వాహనాలు నడపడానికి అనుమతించే తల్లిదండ్రులపై చర్యలు తీసుకునే పరిస్థితి



ఏర్పడింది. అయితే అన్ని ప్రాంతాల్లో ఒకే విధమైన నిబంధనలు లేకపోవడంతో తల్లిదండ్రులు, పిల్లలు ఏ వాహనం చట్టబద్ధమైనది, ఏది ప్రమాదకరమైనది అనే విషయంలో గందరగోళానికి గురవుతున్నారు. కనీస వయస్సు ఉండాలా..ఇటీవల ఓ టీనేజర్ చట్టవిరుద్ధమైన ఈ-వాహనంతో ప్రమాదానికి గురై మరణించడం ఈ అంశంపై మరోసారి చర్చకు దారితీసింది. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఈ-బైక్‌లను విక్రయిస్తున్న సంస్థలపైనా అధికారులు దృష్టి సారిస్తున్నారు. నిబంధనలకు మించి వేగం లేదా శక్తి కలిగిన ఈ-బైక్‌లను విక్రయిస్తే ఒక్కో విక్రయానికి భారీగా జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈ-బైక్ నడిపేవారికి కనీస వయస్సుతో పాటు లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ వంటి నిబంధనలను తప్పనిసరి చేయాలని చూస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నిర్దిష్ట వయస్సు కంటే తక్కువ ఉన్నవారు అధిక వేగంతో ప్రయాణించే ఈ-బైక్‌లను నడపకుండా పరిమితులు విధిస్తున్నారు. వేగ పరిమితులు, హెల్మెట్ వినియోగం, వాహన సామర్థ్యానికి మారుతున్నాయి.

# జిల్లా ఆసుపత్రులను సూపర్ వైద్య కేంద్రాలుగా తీర్చిదిద్దాలి



- మేజర్ శస్త్రచికిత్సలు చేసే స్థాయికి అభివృద్ధి
- అవసరం లేకుండా రోగులను రిఫర్ చేయొద్దని ఆదేశం
- కొత్త సీటీ స్కాన్లు, పరికరాల ఏర్పాటుకు చర్యలు
- నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తప్పవని
- మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరిక

**హైదరాబాద్, ఆగస్టు 22 (మన విశ్వం):** రాష్ట్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులను మేజర్ శస్త్రచికిత్సలు కూడా నిర్వహించగల పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రజలకు తమ ప్రాంతాల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా జిల్లా, ఏరియా ఆసుపత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ఈ మేరకు కీలక సూచనలు చేశారు. టీచింగ్ ఆసుపత్రులతో సమానంగా జిల్లా, ఏరియా ఆసుపత్రులు కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించే స్థాయికి చేరుకోవాలని మంత్రి అన్నారు. ఇటీవల టీచింగ్ ఆసుపత్రుల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేసినట్లు గుర్తుచేసిన ఆయన, జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించినట్లు తెలిపారు. వైద్యులు, సిబ్బందితో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాలు కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు.

చిన్నచిన్న సమస్యలకు కూడా రోగులను పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేయడం వల్ల ప్రజలకు అనవసర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా చికిత్స అందించే అవకాశం ఉన్నప్పటికీ రోగులను పైస్థాయి ఆసుపత్రులకు పంపడం వల్ల వారి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే రిఫర్ చేయాలని, అలాంటి సందర్భాల్లో కూడా ముందుగానే సంబంధిత ఆసుపత్రులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. రోగులకు స్థానికంగానే మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యత పెంచేందుకు అవసరమైన చోట కొత్త సీటీ స్కాన్లు, డయాగ్నస్టిక్ పరికరాలు, ఇతర ఆధునిక వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. పరికరాల కోసం ప్రతిపాదనలు పంపేటప్పుడు రోగుల సంఖ్య, అవసరాలు, వినియోగ సామర్థ్యం వంటి అంశాలను స్పష్టంగా వివరించాలని చెప్పారు. కేవలం డిమాండ్ ఆధారంగా కాకుండా శాస్త్రీయ విశ్లేషణతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్లు వారానికి కనీసం ఒకరోజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతున్నారా, రోగులకు సరైన చికిత్స అందుతోందా, పరికరాలు పనిచేస్తున్నాయా, మందుల కొరత ఉందా వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. పరిశుభ్రత, తాగునీటి సరఫరా, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి నెల తమ తనిఖీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టం చేశారు. విధులకు గైర్హాజరు కావడం, ముందుగానే ఆసుపత్రి నుంచి వెళ్లిపోవడం, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం వంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం సహించదని మంత్రి హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి వెంటనే పరిష్కరించాలని, స్థానికంగా పరిష్కరించగల సమస్యలను పెండింగ్‌లో ఉంచవద్దని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే దిశగా ప్రతి అధికారి, ప్రతి వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు.

# నేటి నుంచే కొత్త ఈహెచ్ఎస్.. నగదు రహిత వైద్యానికి భరోసా



- ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట కుటుంబ సభ్యులకూ వర్తింపు
- కార్పొరేట్ ఆసుపత్రులతో కుదిరిన ఏకాభిప్రాయం
- ఎంపానెల్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్సలు
- కొత్త మార్గదర్శకాలతో పథకం అమలు

**హైదరాబాద్, ఆగస్టు 22 (మన విశ్వం):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య సేవల విషయంలో ఊరట కలిగించే కీలక నిర్ణయం అమల్లోకి వచ్చింది. నూతన విధానాలతో రూపొందించిన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) శనివారం నుంచి అమలులోకి వచ్చింది. ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు ఎంపానెల్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు పొందేలా కొత్త విధానాన్ని అందు బాటులోకి తెచ్చారు. ఈహెచ్ఎస్ అమలుపై తెలంగాణ సచివాలయంలో ఎంప్లాయీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. టీజీ-జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్వర్, ట్రస్ట్ బోర్డు సభ్యులతో పాటు తెలంగాణ స్టేట్ హాస్పిటల్స్ అసోసియేషన్, అపోలో, కాంటినెంటల్, యశోద, కిమ్స్ తదితర కార్పొరేట్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు. పథకం అమలు, వైద్య సేవలు, క్లెయిమ్‌ల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు.

**- ఆసుపత్రుల నుంచి సానుకూల స్పందన**

కొత్త ఈహెచ్ఎస్‌ను తక్షణమే అమలు చేసేందుకు ఆసుపత్రుల సంఘం, కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు అంగీకరించాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎంపానెల్ చేసిన ఆసుపత్రుల్లో అర్హులైన ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత చికిత్సలు అందుబాటులోకి రానున్నాయి. చికిత్స కోసం ముందుగా పెద్ద మొత్తంలో నగదు చెల్లించాల్సిన పరిస్థితిని నివారించడమే లక్ష్యంగా ఈ విధానాన్ని రూపొందించారు.

**- క్లెయిమ్‌ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**

కొత్త ఈహెచ్ఎస్‌కు సంబంధించిన మార్గదర్శకాల్లో ఆసుపత్రుల ఎంపానెల్‌మెంట్, చికిత్స విధానాలు, క్లెయిమ్‌ల పరిష్కారం, రోగులకు అందించాల్సిన సేవలపై స్పష్టత ఇచ్చారు. లబ్ధిదారులకు సకాలంలో చికిత్స అందడంతో పాటు క్లెయిమ్‌లు త్వరగా పరిష్కారమయ్యేలా వ్యవస్థను పారదర్శకంగా తీర్చిదిద్దినట్లు అధికారులు తెలిపారు.

పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి ఉద్యోగులు, పెన్షనర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎంపానెల్ ఆసుపత్రులను ట్రస్ట్ కోరింది. కొత్త ఈహెచ్ఎస్‌తో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఉద్యోగ, పెన్షనర్ కుటుంబాలకు ఆరోగ్యపరంగా మరింత భరోసా లభించనుంది

# సీఎం రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత అన్నీ మాట్లాడతా

**హైదరాబాద్, ఆగస్టు 22::** సీఎం రేవంత్ రెడ్డిపై తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలపై 2 రోజుల క్రితమే అన్నీ చెప్పానని, ఈరోజు (శుక్రవారం) చెప్పడానికి ఏమీ లేదని మంత్రి కొండా సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్? నుంచి తిరిగి వచ్చిన తర్వాత అన్ని విషయాలపై పూర్తిగా మాట్లాడతానని తెలిపారు. తన కుమార్తె వ్యాఖ్యలను మంత్రి ఖండించకపోవడాన్ని సీఎల్పీ వేదికగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విమర్శించారు. ఈ విషయం పట్ల మంత్రి కొండా సురేఖను ప్రశ్నించగా, పైవిధంగా స్పందించారు.క్రమ శిక్షణ సంఘానికి లేఖ : ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆమెకు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు



క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ ఎంపీ మల్లు రవికి వివరణ పంపారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని లేఖలో ఆమె కోరారు.తీవ్ర స్థాయిలో చర్చకు : మరోవైపు కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మంత్రి కుమార్తె చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చకు దారి తీశాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులు ఇవ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు భావిసున్నాయి.అందరి టార్గెట్ సీఎం : ఇటీవల మును గోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివా దాలు కాంగ్రెస్ పార్టీని కొంత ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అంతర్గత వ్యవహారాలను బహిరంగంగా చెప్పడం వల్ల ప్రతిపక్షాలకు ఆయుధాన్ని ఇచ్చినట్లే అవుతున్నాయి. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుతమైన రాజకీయ వాతావరణం ఉంటుంది. కానీ ఈ మధ్య అందరూ సీఎం రేవంత్ రెడ్డినే లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం కొంత ఇరుకున పడేస్తుంది.

# దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్ తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు

**హైదరాబాద్ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌అనర్హత పిటిషన్ పై తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. సెప్టెంబర్ 16వ తేదీన తుది తీర్పు ఇవ్వనున్నట్లు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ధర్మాసనం శనివారం వెల్లడించింది.ఫిరాయింపు ఎమ్మెల్యేల పై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టివేస్తూ స్పీకర్ ఇచ్చిన తీర్పును




సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో బీఆర్‌ఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా, దానం నాగేందర్ బీఆర్‌ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ కూడా చేశారని బీఆర్‌ఎస్ తరపు న్యాయవాదులు కె.వివేక్ రెడ్డి, గండ్ర మోహన్ రావు కోర్టుకు వివరించారు.పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నా స్పీకర్ అనర్హత పిటిషన్ కొట్టివేశాడని వెల్లడించారు. తాను ఇంకా బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నారని ఫిరాయింపు ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఇరు వర్గాల వాదనలు విని తుది తీర్పును రిజర్వ్ చేస్తూ, సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# రేవంత్ రెడ్డి షెడ్యూల్‌లో ఎవరిని కలుస్తున్నారో వారి పేర్లు లేవు



**హైదరాబాద్, ఆగస్టు 22:** సీఎం రేవంత్ రెడ్డిని కేంద్ర విదేశాంగ శాఖ అవమానించింది.. లండన్‌కు పర్మిషన్ ఇచ్చారు. కానీ అమెరికాకు వెళ్లేందుకు పర్మిషన్ ఇవ్వలేదు. గతంలో ఏ ముఖ్యమంత్రికి ఈ విధంగా జరగలేదు. ఇది రేవంత్ రెడ్డికి చెంప పెట్టు.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు అవమానం అని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర విదేశాంగ శాఖ పర్మిషన్ ఇవ్వని విధంగా తప్పుడు నిర్ణయాలు ఏం తీసుకున్నారో బయట పెట్టాలి.రేవంత్ రెడ్డి ఏం తప్పు చేస్తారని కేంద్ర విదేశాంగ శాఖకు తెలిసింది.. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి,కేంద్రం ఇద్దరు సమాధానం చెప్పాలన్నారు..రేవంత్ రెడ్డి షెడ్యూల్ లో ఏం తప్పులు ఉన్నాయో తెలంగాణ ప్రజలకు చెప్పాలి.. రేవంత్ రెడ్డి పై కేంద్రం ఆరోపణలు చేసి అమెరికా పర్యటనను రద్దు చేసింది.. సందర్భం కాని పనులు సీఎం రేవంత్ రెడ్డి ఏం చేద్దామని అనుకున్నారని అడిగారు. సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యాలకు వ్యతిరేకంగా షెడ్యూల్ ఉందా..? రేవంత్ రెడ్డి తన సీఎం పదవికి తగని విధంగా పనులు చేస్తున్నారని కేంద్రం చెప్పకనే చెప్పింది.సీఎం రేవంత్ రెడ్డి మనకు తెలియని విషయాన్ని అమెరికాలో చేస్తున్నారు . ఆ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి,కేంద్రం ఇద్దరూ దాస్తున్నారు. ఏ కారణాలతో రేవంత్ రెడ్డిని ఆపారో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ట్రంప్‌కు వ్యతిరేకంగా ఉన్న న్యూయార్క్ మేయర్ మందాని ను కలవడానికి సీఎం రేవంత్ రెడ్డి వెళ్తే ఆపారని అంటున్నారు. రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా అందానీ కోసం పోవాలనుకున్నారా..? లేక న్యూయార్క్ మేయర్ మందాని కోసం పోవాలనుకున్నారా..? ఆగస్టు 27,28 వ తేదీన రేవంత్ రెడ్డి షెడ్యూల్ లో ఎవరిని కలుస్తున్నారో వారి పేర్లు లేవు. రేవంత్ రెడ్డి విదేశాల్లో హవాలా చేస్తున్నారని.. బీజేపీ నేతలు అంటున్నారు.

# మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో కాంక్రీట్ లోపం అన్నారం, సుందిళ్లలు ఓకే

**హైదరాబాద్, ఆగస్టు 22:** మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్ నిర్మాణంలో కాం క్రీట్ నాణ్యత లోపించినట్లు తేలింది. ఈ బ్లాక్ లోని 16 నుంచి 21వ పియర్ వరకు నాణ్యతా లోపాలున్నట్లు కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ సీడబ్ల్యూపీఆర్?ఎస్ నిర్వహించిన కాంక్రీట్ క్వాలిటీ పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. 6 పియర్లలో నాణ్యత లేకపోవడం లేదా ప్రశ్నార్థకంగా ఉన్నట్లు పేర్కొంది. అన్నారంలో ఏ బ్లాక్‌లోనూ, ఏ పియర్‌లోనూ సమస్య లేదని, నాణ్యత బాగుందని స్పష్టం చేసింది. సుందిళ్ల బ్యారేజీలో కూడా కాంక్రీట్ నాణ్యత బాగుందని, ఒక బ్లాక్‌లో ఒక శాతం మాత్రమే సమస్య ఉందని పేర్కొంది.నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ పద్ధతిలో 2 పరీక్షల నిర్వహణ : కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణలో భాగంగా ఇప్పటికే పలు పరీక్షలు జరుగుతున్నాయి. బ్యారేజీల కాంక్రీట్ స్ట్రక్చర్ నాణ్యత ఎలా ఉంది? డిజైన్ ప్రకారం వరద ప్రవాహం వెళ్తుందా? లేక ఇంకేమైనా సమస్యలున్నాయా? వీటికి కాంక్రీట్ నాణ్యతకు ఉన్న సంబంధంపై అధ్యయనం జరిగింది. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ పద్ధతిలో రెండు పరీక్షలు నిర్వహించింది. అల్ట్రాసోనిక్ పల్స్ వెలాసిటీ టెస్ట్, రీబౌండ్ హ్యామర్ టెస్ట్‌ల ఆధారంగా



బ్యారేజీల కాంక్రీట్ నాణ్యతపై చేసిన అధ్యయన నివేదికను సీడబ్ల్యూపీఆర్?ఎస్ ప్రధాన శాస్త్రవేత్త ఎంఎస్? హనుమంతప్ప కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్‌కు పంపారు. మేడిగడ్డ బ్యారేజీ 8 బ్లాక్‌లలో 68 స్పిల్‌వే గేట్లు, 17 అండర్ స్లూయిస్ గేట్లు కలిపి 85 రేడియల్ గేట్లున్నాయి. వీటికి సంబంధించిన అన్ని పియర్స్‌పై అధ్యయనం జరిగింది.ఆరో బ్లాక్ కాంక్రీట్ నాణ్యతపై సందేహం : బ్యారేజీలో 84,800 యూపీవీ, 50,400 ఆర్‌హెచ్‌టీ నమూనాలు సేకరించి పరీక్షించారు. 8 బ్లాక్‌లకుగాను ఒకటి నుంచి ఆరు, ఎనిమిదో బ్లాక్‌లో ఎలాంటి నాణ్యతా సమస్యలు లేవని పేర్కొంది. అన్నారం, సుందిళ్లలో కొన్ని ఎక్సలెంట్, గుడ్ అని పేర్కొనగా మేడిగడ్డలో మాత్రం గుడ్, సంతృప్తికరం అనే నిర్ధారణలు ఎక్కువగా ఉన్నాయి. ఆరో బ్లాక్‌లోని 33,34వ పియర్‌లో తక్కువ భాగం కాంక్రీట్ నాణ్యతపై సందేహం వ్యక్తం చేసినా 95 శాతం ఫలితాలు బాగున్నాయి కాబట్టి మొత్తమ్మీద కాంక్రీట్ నాణ్యత సంతృప్తికరమేనని పేర్కొంది. అయితే 2023లో కుంగిన ఏడో బ్లాక్‌లో మాత్రం రెండు పరీక్షల్లోనూ నాణ్యతకు సంబంధించి లోపాలు వెలుగు చూశాయి.నాణ్యతలో పూర్తిగా సందేహాలున్నట్లు పేర్కొంది. ఈ బ్లాక్‌లో మొత్తం 11 పియర్స్ ఉండగా12 నుంచి 15 వరకు, తర్వాత 22వ పియర్ బాగున్నాయి. 22వ పియర్‌లో కూడా 3.9 శాతం ఫలితాలు సందేహం, 1.9 శాతం పూర్ అని నివేదికలో పేర్కొన్నా మిగిలిన ఆరు పియర్లలో చాలా ఎక్కువగా ఉండటంతో ఇవి సమస్యగా పేర్కొంది. అత్యధికంగా నాణ్యత సందేహం, పూర్ అని పేర్కొన్న వాటిలో 19, 18, 20, 17, 21, 16వ పియర్‌లకు సంబంధించి వరుసగా 73.3శాతం, 65.5, 61.1, 50.5, 49.9, 41.3 శాతాలుగా ఉన్నాయి. వీటి పునరుద్ధరణకు సమగ్ర పరిశీలన, అనుబంధ పరీక్షలను సీడబ్ల్యూపీఆర్ ఎస్ సిఫార్సు చేసింది.అన్నారంలో ఎలాంటి సమస్యా లేదు : అన్నారం బ్యారేజీలో నూటికి నూరు శాతం ఎలాంటి నాణ్యతా సమస్యలు లేవని నివేదిక వెల్లడించింది. ఇందులో నాలుగో బ్లాక్‌లోని ఐదు పియర్స్‌లో మాత్రమే స్వల్ప సమస్యలున్నాయి. బ్లాక్‌లవారీగా చూస్తే నాలుగో బ్లాక్ కన్సాలిడేటేడ్ నివేదిక ప్రకారం 1.1 శాతం సమస్య ఉంది.ఇందులో కూడా 42వ పియర్ దిగువ భాగంలో కుడివైపు కొద్దిగా సమస్య ఉందని ఫలితాలన్నింటిలో కాంక్రీట్ నాణ్యత చాలా బాగున్నట్లు రాగా రీబౌండ్ హ్యామర్ టెస్ట్‌లలో ఓ బ్లాక్‌లో కొన్ని నమూనాల్లో తేడా వచ్చినా బ్యారేజీ మొత్తమ్మీద చూసినపుడు నాణ్యత స్థిరంగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

# ఫార్మా కంపెనీలో పేలిన రియాక్టర్ - ఇద్దరు కార్మికుల మృతి - మరో 9 మందికి గాయాలు

**యాదాద్రి భువనగిరి జిల్లా :** భూదాన్ పోచంపల్లి మండల పరిధి దోతిగూడెం గ్రామంలోని హెజిలో ఫార్మా కంపెనీలో శుక్రవారం అర్ధరాత్రి ప్రమాదం చోటు చేసుకుంది. రియాక్టర్ పేలడంతో భారీ శబ్దాలు వచ్చాయి. మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 9 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.భారీ శబ్దాలతో పేలిన రియాక్టర్ : స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, హెజిలో ఫార్మా కంపెనీలో భారీ శబ్దంతో రియాక్టర్ పేలడంతో గ్రామస్థులు భయంతో ఉలిక్కిపడ్డారు. ఇళ్ల నుంచి బయటకు వచ్చి చూసేసరికి పరిశ్రమ నుంచి భారీ ఎత్తున మంటలు ఎగిసి పడటం గమనించారు. పరిశ్రమ యాజమాన్యం అప్రమత్తం అయ్యి అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగిన ఘటనా స్థలంలో 10 మందికి పైగా ఉన్నారని అక్కడే పని చేసే ఇతర కార్మికులు తెలిపారు. వారిలో ఇద్దరు చనిపోగా, 9 మంది



గాయాలయ్యాయని, క్షతగాత్రులను వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారని వివరించారు. ఇదే పరిశ్రమలో 3 నెలల వ్యవధిలోనే ఇది రెండో ప్రమాదం కావడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. మృతులు, క్షతగాత్రుల వివరాలు : నల్గొండ జిల్లా పెద్దవూర మండలం చిన్నగూడెం గ్రామానికి చెందిన చెన్ను నాగిరెడ్డి (31), ఖమ్మం జిల్లా చౌడారం గ్రామానికి చెందిన నాగనబోయిన నరేశ్ కుమార్ (29) మృతి చెందగా, రాణబోతు రాజశేఖర్ రెడ్డి (38), శ్రీహరి మేడ (27), చెన్నారెడ్డి శివకుమార్ రెడ్డి (30), మారెళ్ల యోహాన్ (26), వేదుల చెన్న కేశవులు (38) యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కంబంపాటి యేసుదాసు (25), దూడల శివశంకర్ (28), శాకేటి గణేశ్? (30), పెంట్యాల రవి(42)లకు హైదరాబాద్?లోని సన్‌షైన్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కంపెనీలను మూసేయాలి : ఇదిలా ఉండగా, హెజిలో కంపెనీ గేటు ముందు అంతమ్మ గూడెం, దోతిగూడెం గ్రామస్థులు ధర్నాకు చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 కోట్ల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస జాగ్రత్తలు తీసుకోకపోవటం వల్లే ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాపోయారు. ఈ ప్రాంతంలో ఉన్న రసాయన పరిశ్రమలను వెంటనే మూసివేయాలని, లేకుంటే ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# సహజ న్యాయసూత్రం ప్రకారం ఆ వ్యాఖ్యల్ని ఎందుకు ఖండించలేదు

**హైదరాబాద్, ఆగస్టు 22:**




కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ సమానంగా చూస్తోందని బీసీలను ఒకలా, రెడ్డిలను మరోలా చూడట్లేదని తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి పేర్కొన్నారు. (శనివారం) ఏబీఎన్‌తో మాట్లాడిన ఆయన. కాంగ్రెస్ ప్రభుత్వంపై సొంత పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై స్పందిం చారు. కొండా సుస్మిత వ్యవహారంపై అధి ష్ఠానం స్పందించిందని, ఈ మేరకు మం త్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసిందన్నారు. దీనిపై మంత్రి సురేఖ వాట్సాప్‌లో వివరణ లేఖను పంపినట్టు తెలిపారు. అయితే.. ఈ లేఖపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో పార్టీ పెద్దలు చర్చిస్తున్నారని చెప్పారు.సుస్మిత చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని పేర్కొన్న కొండా సురేఖ వివరణను మల్లు రవి వ్యతిరేకించారు. 'పార్టీకి వ్యతిరేకంగా ఒకరు మాట్లాడుతుంటే దేవదాయశాఖ మంత్రి హోదాలో ఉన్న కొండా సురేఖ ఎందుకు స్పందించలేదు? పార్టీ సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఖండించాల్సింది. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నప్పుడు మౌనంగా ఎందుకు ఉన్నారు?' అని ప్రశ్నించారు. కాగా.. గతంలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై సుస్మిత వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.అలాగే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన అంశంపై కూడా మల్లు రవి స్పందించారు. ఈ విషయంపై ఇప్పటివరకూ ఎవరూ ఫిర్యాదు చేయలేదని, సమయం వచ్చినప్పుడు ఆ అంశాన్ని సుమోటోగా స్వీకరిస్తామని స్పష్టం చేశారు.

# వేలేరు మండలానికి సాగునీరు అందించాలని ఎమ్మెల్యే శ్రీహరికి వినతి

**వేలేరు:** వరంగల్ జిల్లా వేలేరు మండలంలోని రైతులకు సాగునీరుఅందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు, రైతులు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి శనివారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని సాగు భూములకు గోదావరి జలాలు అందేలా పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులను వేగవంతం చేయాలని కోరారు. వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు



సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత పరిష్కారం కోసం ఎత్తిపోతల పథకాలు, పైప్‌లైన్, కాలువల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వేలేరు మండలానికి గండి రామారం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు అందించి రెండు పంటలకు సాగునీరు కల్పిస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇచ్చిన హామీని గుర్తు చేశారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారావు, సర్పంచ్ మరిజె అనిత, నాయకులు విజేందర్ రెడ్డి, జానీ, హరీఫ్ పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌ను కలిసిన ఆక్స్‌ఫర్డ్ ప్రొఫెసర్.

**హైదరాబాద్, ఆగస్టు 22:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన యూకే పర్యటనలో భాగంగా ఆక్స్‌ఫర్డ్ యూని వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ మాయా ట్యూడర్‌తో సమావేశం కావడం రాజకీయంగా తీవ్ర చర్చనీ యాంశమైంది. పరిపాలన, ప్రభుత్వ విధానా లపై చర్చించేందుకు నిన్న జరిగిన ఈ భేటీపై బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. మాయా ట్యూడర్ ఒక 'భారత వ్యతిరేకి' అని, అలాంటి వ్యక్తితో సీఎం భేటీ కావడం సరికాదని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు ఎవరీ మాయా ట్యూడర్? ఆమె నేపథ్యం ఏమిటి? ఈ వివాదానికి కారణమేంటి? అనే విషయాలు ఆసక్తికరంగా మారాయి.ఎవరీ మాయా ట్యూడర్?మాయా ట్యూడర్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని ప్రతిష్ఠాత్మక బ్లావత్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో పాలిటిక్స్ అండ్ పబ్లిక్



పాలసీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె సెయింట్ హిల్డాస్ కాలేజీలో ఫెలోగా కూడా ఉన్నారు. ప్రధానంగా దక్షిణాసియాలో ప్రజాస్వామ్య, సమర్థవంతమైన రాజ్యాల ఆవిర్భావంపై ఆమె పరిశోధనలు కేంద్రీకృతమై ఉంటాయి. ప్రజాస్వామ్యాలు ఎలా ఏర్పడతాయి, ఎలా నిలదొక్కుకుంటాయి, జాతీయవాదానికి-ప్రజాస్వామ్యానికి మధ్య ఉన్న సంబంధం, అధికారంలో ఉన్న బలమైన పార్టీలు ఎలా అధికారం కోల్పోతాయి వంటి అంశాలపై ఆమె విస్తృతంగా అధ్యయనం చేశారు.వివాదానికి కారణమైన వ్యాసాలు, రచనలు2013లో మాయా ట్యూడర్ 'ది ప్రామిస్ ఆఫ్ పవర్: ది ఆరిజిన్స్ ఆఫ్ డెమోక్రసీ ఇన్ ఇండియా అండ్ ఆటోక్రసీ ఇన్ పాకిస్థాన్' అనే పుస్తకాన్ని రచించారు. నిరంకుశ పాలన వైపు వెళ్లిందనే అంశాలను ఈ పుస్తకంలో ఆమె విశ్లేషించారు. భారతదేశంలోని సమ్మిళిత జాతీ యవాద ఉద్యమమే ఇందుకు ఒక కారణమని ఆమె పేర్కొన్నారు.అయితే, 2023లో ఆమె 'జర్నల్ ఆఫ్ డెమోక్రసీ'లో రాసిన 'వై ఇండియా స్ డెమోక్రసీ ఈజ్ డయింగ్' అనే వ్యాసం తీవ్ర వివాదాస్పదమైంది. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో దేశంలో ప్రజాస్వామ్యం క్షీణిస్తోంద'ని ఆమె ఆ వ్యాసంలో విశ్లేషించారు. సరిగ్గా ఈ వ్యాసాన్నే బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు. భారత వ్యతిరేక రచనలు చేసే వ్యక్తితో ముఖ్యమంత్రి సమావేశం కావడం రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని ఆయన ఆరోపించారు.ప్రభుత్వ వాదన ఇదే..మరోవైపు, మాయా ట్యూడర్ పరిశోధన కేవలం భారతదేశానికే పరిమితం కాదు. ఆమె వివిధ దేశాల రాజకీయ వ్యవస్థలు, జాతీయవాదంపై కూడా అధ్యయనాలు చేశారు. బీజేపీ విమర్శ లపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో సహకారాన్ని అన్వేషించే ప్రయత్నాల్లో భాగంగానే ఈ సమావేశం జరిగిందని స్పష్టం చేసింది. ఒక విద్యావేత్తతో జరిగిన సమావేశాన్ని రాజకీయ కోణంలో చూడటం సరికాదని పరోక్షంగా సూచించింది.

## ఏఈఈ నియామక పరీక్షకు ఏర్పాట్లు పూర్తి... ప్రలోభాలు నమ్మొద్దన్న



**అమరావతి, ఆగస్టు 22:** వివిధ విద్యుత్ రంగ సంస్థల్లో ఏఈఈ ఉద్యోగాల నియామక పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శనివారం) మీడియాతో మాట్లాడుతూ. 629 ఉద్యోగాలకు లక్షమంది పైగా దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా తేదివారం నిర్వహిస్తున్న పరీక్షను నిరుద్యోగు లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెప్పుడు మాటలు, ప్రలోభాలు ఎవ్వరూ నమ్మొద్దన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా నిరుద్యోగుల్ని మోసాగించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎవరైనా ప్రలోభ పెడుతుంటే అభ్యర్థులు కూడా నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని మంత్రి సూచించారు. ఖాళీల భర్తీ ద్వారా విద్యుత్ ఉద్యోగ అవకాశాలు కల్పించటంతోపా టు విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయటమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని స్పష్టం చేశారు. 629 ఏఈఈల నియామకం ద్వారా విద్యుత్ రంగంలో ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందుతాయని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

## వెలిగొండ నిర్వాసితులకు రూ.250 కోట్ల పరిహారం.. ఆగస్టు 31న ప్రాజెక్టు ప్రారంభం

**వెలిగొండ :** దశాబ్దాల నాటి వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితు లకు అండగా నిలుస్తూ కూటమి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. సీఎం చంద్ర బాబు నాయుడు మూడో విడత పునరావాస, పునర్నిర్మాణ (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీ కింద రూ.250 కోట్ల చెక్కును నిర్వాసిత కుటుం బాలకు అందించారు. ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన చారిత్రక ప్రకటన చేశారు. దీంతో ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల 30 ఏళ్ల కల సాకారం కానుంది.ఇప్పటికే రెండు విడతల్లో పరిహారం అందించిన ప్రభుత్వం, తాజాగా మూడో విడతలో 2,027 కుటుం బాలకు రూ.250 కోట్లు పంపిణీ చేసింది. దీంతో ఇప్పటివరకు మొత్తం 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల మేర పరిహారం అందినట్లయింది. ప్రాజెక్టుకు సంబంధించి ఆర్ అండ్ ఆర్ పనులు 85 శాతం పూర్తయ్యాయని అధికారులు



తెలిపారు. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి నిర్వాసితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఈ చర్యలు స్పష్టం చేస్తున్నాయి.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ. అసాధ్యమనుకున్న ప్రాజెక్టును సుసాధ్యం చేసి చూపిస్తున్నామన్నారు. "1996లో నేను శిలాఫలకం వేసిన ఈ ప్రాజెక్టును 2026లో ప్రారంభించుకోవడం నా అదృష్టం. గత రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేసి పనులను వేగవంతం చేశాం. ఎన్టీఆర్ ప్రారంభించిన అనేక ప్రాజెక్టులను పూర్తి చేసే అవకాశం నాకు దక్కింది" అని ఆయన గుర్తు చేసుకున్నారు.ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో 50 శాతం లోటు వర్షపాతం ఉందని, శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీళ్లు రాని క్లిష్ట పరిస్థితుల్లోనూ వెలిగొండకు నీరివ్వాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని చంద్రబాబు వివరించారు. "2019లో మేం అధికారంలోకి వచ్చి ఉంటే 2021 నాటికే ఈ ప్రాజెక్టు పూర్తయ్యేది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం, డ్రామాల వల్లే ఇంత జాప్యం జరిగింది" అని ఆయన విమర్శించారు. పోలవరం పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీరందించి, శ్రీశైలంలో నీటిని పొదుపు చేయడం ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప, రాయలసీమ ప్రాంతాలకు నీరివ్వవచ్చని సీఎం తెలిపారు. దేశంలో నీటి భద్రత సాధించేందుకు గంగా-గోదావరి-కావేరి నదుల అనుసంధానం చేయాలని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించినట్లు వెల్లడించారు. ఈ ఐదు నదుల అనుసంధానంతో నాలుగు రాష్ట్రాల నీటి సమస్యలు తీరతాయని ఆయన అభిప్రాయపడ్డారు.స్థానిక అభివృద్ధిపైనా చంద్రబాబు పలు హామీలిచ్చారు. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి నీరు అందిస్తామని, పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. సెప్టెంబరులో హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేస్తామన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీసినా, 'సూపర్ సిక్స్' వంటి పథకాలను అమలు చేస్తూనే, అభివృద్ధి, ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్య త ఇస్తున్నామని తెలిపారు. మంచి చేసే ప్రభు త్వాన్ని ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు.

## వైఎస్సార్సీపీ హయాంలో పంచాయతీ నిధులు గోల్‌మాల్

ఐదేళ్ల పాలనలో అన్ని వ్యవస్థలనూ అక్రమాలకు అడ్డాగా మార్చిన గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం. పంచాయతీల్లోనూ రూ.31 కోట్ల రూపాయలను దుర్వినియోగం చేసింది. ఆర్థిక సంఘం, సాధారణ నిధులను పక్కదారి పట్టించింది. అవకతవకల్లో మాజీ సర్పంచ్‌లు, సిబ్బంది పాత్ర ఉన్నట్లు గుర్తించిన కూటమి ప్రభుత్వం, నిధుల రికవరీకి చర్యలు చేపట్టింది.గత వైఎస్సార్సీపీ పాలనలో గ్రామ పంచాయతీల్లో రూ.31.33 కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగమయ్యాయి. వీటిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14.40 కోట్లు, పంచాయతీల సాధారణ నిధుల నుంచి మరో రూ.17.29 కోట్లు పక్కదారి పట్టాయని ప్రభుత్వం నిర్ధారించింది. 16 జిల్లాల్లో బాధ్యులైన 80 మంది మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది నుంచి నిధుల రికవరీకి చర్యలు చేపట్టింది. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల్లో నుంచి గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం రూ.2,165 కోట్లు ఇతర అవసరాలకు మళ్లించింది. సర్పంచుల అనుమతి లేకుండానే పంచాయతీ ఖాతాల్లో నిధులు



వాడేసింది. మిగిలిన నిధుల్లో నుంచి కొందరు సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది కలిపి దుర్వినియోగం చేశారు.ఐదుగురు సస్పెన్షన్ - 20 మందికి తాఖీదులు: గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్థిక సంఘం నిధులతో పాటు పంచాయతీలకు ఆస్తి పన్ను, ఇతర పద్దుల కింద వచ్చే సాధారణ నిధుల దుర్వినియోగం పైనా విచారించి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నివేదిక రూపొందించింది. ఈ వ్యవహారానికి సంబంధించి ఐదుగురు పంచాయతీ కార్యదర్శుల్ని సస్పెండ్ చేయగా, మరో 20 మంది కార్యదర్శులకు తాఖీదులు ఇచ్చారు. చిత్తూరు జిల్లాలో మాజీ సర్పంచి ఒకరిపై పోలీసు కేసు నమోదైంది. ఇంకో 10 మంది ఆర్?ఆర్? చట్టం కింద నిధుల రికవరీకి కలెక్టర్లు నోటీసులు ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలో అత్యధికంగా రూ.4.52 కోట్లు ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అయ్యాయి. ఏలూరులో రూ.2.89 కోట్లు, నంద్యాలలో రూ.2.52 కోట్లు, శ్రీకాకుళం జిల్లాలో రూ.1.08 కోట్లు పక్కదారి పట్టినట్లు విచారణలో వెల్లడైంది.కృష్ణా, ఎన్టీఆర్, శ్రీకాకుళం జిల్లాల్లో వెలుగులోకి: ఆర్థిక సంఘం నిధుల వ్యయానికి పలు పంచాయతీల్లో లెక్కల్లేవు. మరికొన్ని చోట్ల రికార్డులే కనిపించడం లేదు. కృష్ణా, ఎన్టీఆర్, శ్రీకాకుళం జిల్లాల్లో ఇలాంటివి వెలుగు చూశాయి. పంచాయతీల్లో పారిశుద్ధ్య పనుల కోసం నిధులు ఖర్చు చేశామని కార్యదర్శులు, సిబ్బంది వివరణ ఇచ్చారు. రికార్డులు చూపించమంటే సమాధానం లేదు. గ్రామాల్లో రోడ్లు, కాలువల పనులకు నిధులు ఖర్చు చేసినట్లు నంద్యాల, ఏలూరు, చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లో పలు పంచాయతీల్లో రికార్డులు సృష్టించారు. ఇంకొన్ని చోట్ల అరకొరగా పనులు చేసి, పూర్తయినట్లు చూపించి బిల్లులు చెల్లించేశారు.సిబ్బంది ఖాతా ల్లోకి ఆర్థిక సంఘం నిధుల జమ: కృష్ణా, కాకినాడ, బాపట్ల, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలు పంచాయతీల్లో సిబ్బంది వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి ఆర్థిక సంఘం నిధులు జమ చేశారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, చెత్త సేకరణ వాహనాలకు డీజిల్, ఇతరత్రా అత్యవసర పనులకు నిధులు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపారు. నిధులు సిబ్బంది ఖాతాల్లో వేసి వాటిని సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది కలిసి పంచుకున్నారని అనుమానిస్తూ.. సమగ్ర విచారణకు అధికారులు సిఫార్సు చేశారు. అన్నమయ్య, అనంతపురం, కృష్ణా, పశ్చిమ గోదావరి, తిరుపతి జిల్లాల్లో పలు పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, ఇతర అత్యవసర పనులకు నిధులు ఖర్చు చేసినట్లుగా రికార్డులు సృష్టించి, సాధారణ నిధులు మింగేశారు.

## యువతతోనే 'వికసిత్ భారత్' సాధ్యం

**విజయవాడ, ఆగస్టు 22:** వికసిత్ భారత్ లబ్ధిదారులు ప్రస్తుత యువత అని గోవా సీఎం ప్రమోద్ సావంత్ అన్నారు. విజయవాడలో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సదస్సులో ప్రమోద్ పాల్గొని ప్రసంగించారు. యువత పాలిటిక్స్‌లోకి రావాలనేది పెద్ద ప్రశ్న అన్నారు. 40 ఏళ్ల వయసు తరువాత యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. అనుభవం, స్థిరత్వం ముందు. ఆ తరువాతే పాలిటిక్స్ అని చెప్పుకొచ్చారు. యువశక్తి, నారీశక్తి, కిసాన్ శక్తి, గరీబ్ కల్యాణ్.. వికసిత్ భారత్‌కు నాలుగు మూలస్తంభాలుగా అభివర్ణించారు. గతంలో చాలామందికి బ్యాంకు అకౌంట్‌లు లేవని.. మోదీ ప్రభుత్వంలో జనధన్ ఖాతాలు ఇచ్చారని తెలిపారు.5+ కనెక్టివిటీ ఇప్పుడు అందుబాటలో ఉందని గోవా సీఎం అన్నారు. మోదీ ప్రభుత్వంలో వికసిత్ భారత్ 2047 వైపు అడుగులేస్తున్నామని చెప్పారు. వికసిత్ భారత్ యువతతోనే సాధ్యమవుతుందని వెల్లడించారు. భారతదేశంలో 50 శాతం యువత ఉన్నారని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు.. అమరావతి, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌లో విజన్‌తో ఉన్నారన్నారు. పొలిటికల్ నాలెడ్జ్ ఉన్న యువత చాలా అవసరమని.. పాలసీ తయారు చేయగలి



గేలా, ఫలితాలు సాధించేలా యువత ఉండాలని సూచించారు. భవిష్యత్ ఆంత్రప్రెన్యూర్లు, పాలసీ మేకర్స్, పొలిటిషియన్స్‌గా యువత ఉండాలని ఆకాంక్షించారు. బాధ్యత కలిగిన, దేశం కోసం పని చేయగలిగిన, పారదర్శకత కలిగిన వారుగా యువత ఉండాలని గోవా సీఎం ప్రమోద్ సావంత్ పేర్కొన్నారు.పాలిటిక్స్ గురించి యువత ఆలోచించాలి: మాధవ్2047 కి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారాలని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. స్వతంత్ర సేనానుల కల సాకారం చేయడానికి కృషి చేయాలన్నారు. దేశ రాజకీయాల గురించి యువత ఆలోచించాలని సూచించారు. ప్రధాని మోదీ ప్రయాణం అందరికీ ఒక స్ఫూర్తి అని చెప్పుకొచ్చారు. ఎయిర్, రోడ్, వాటర్ కనెక్టివిటీలను మోదీ అభివృద్ధి చేశారని తెలిపారు. బలహీన వర్గాలకు అందరికీ సామాజిక అభివృద్ధి కలిగించారని మాధవ్ అన్నారు.

## తక్కువ పెట్టుబడి, లక్షల్లో ఆదాయం.. ఏపీలో మహిళలకు 'చాయ్ రాస్తా'తో అద్భుత అవకాశం

**అమరావతి, ఆగస్టు 22:** ఏపీలో మహిళా సాధికారత, స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్త' అనే నినాదాన్ని నిజం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మహిళలు తక్కువ పెట్టుబడితో గౌరవప్రదమైన ఆదాయం సంపాదించేందుకు 'చాయ్ రాస్తా' పేరుతో సరికొత్త పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. డీఆర్‌డీఏ-సెర్ప్ ఆధ్వర్యంలో ఈ పథకం అమలు కానుండ గా, తొలి దశలో అనంతపురం




జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది.ఏమిటీ 'చాయ్ రాస్తా' పథకం?రాష్ట్రంలోని మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇందుకోసం డీఆర్‌డీఏ-సెర్ప్, 'చాయ్ రాస్తా' అనే బ్రాండ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చు కుంది. ఈ పథకం కింద ఎంపికైన మహిళలకు ఫ్రాంచైజ్ పద్ధతిలో ఆధునిక టీ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారు. కేవలం టీ, కాఫీ అమ్మడమే కాకుండా బిస్కెట్లు, కూల్ డ్రింక్స్ వంటి ఇతర చిరుతిళ్లను కూడా విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ ఫ్రాంచైజ్ తీసుకున్న వారికి వ్యాపారం కోసం అవసరమైన కంటైనర్, ప్రాథమిక సరుకులు, ఇతర సామగ్రిని అందిస్తారు. అంతేగాక వ్యాపారానికి అత్యంత కీలకమైన లొకేషన్ సర్వే, అవసరమైన లైసెన్సులు, డాక్యుమెంటేషన్, మార్కెటింగ్, నిర్వహణలో శిక్షణ వంటి అన్ని విషయాల్లోనూ సంస్థ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుంది.

## జాబ్ క్యాలెండర్‌తో యువతకు అండగా ప్రభుత్వం

**అమరావతి, ఆగస్టు 22:** యువత భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కె. పార్థసారథి స్పష్టం చేశారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తూ యువతకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర పరిపాలనలో ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికయ్యే అధికారుల పాత్ర అత్యంత కీలకమని ఆయన వివరించారు. శనివారం రాజధాని అమరావతిలో మంత్రి పార్థసారథి విలేకర్లతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న విమర్శలను తిప్పి కొట్టారు.గత ప్రభుత్వంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ అక్రమాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే.. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ వైసీపీ నేతలపై ఆయన నిప్పులు చెరిగారు. గొడ్డలి పోటుకి, గుండె పోటుకి ఎంత తేడా ఉందో.. గత వైసీపీ ఏపీపీఎస్సీకి, నేటి కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీకి అంత



తేడా ఉందంటూ ఆ పార్టీ నేతలకు చురకలంటించారు. గొడ్డలి పార్టీ తలకిందులుగా తపస్సు చేసినా మెగా డీఎస్సీలో ఒక్క అక్రమాన్ని కూడా రుజువు చేయలేదని పేర్కొన్నారు. ఏపీపీఎస్సీలో జరిగిన అవకతవకలను హైకోర్టు ఎత్తి చూపినా.. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి దున్నపోతు మీద వాన పడిన చందంగా మాట్లాడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. మెగా డీఎస్సీపై వందల కొద్దీ కేసులు వేసిన గొడ్డలి పార్టీ.. కోర్టుకు ఒక్క ఆధారాన్ని కూడా సమర్పించలేక పోయిందని అన్నారు. గొడ్డలి పార్టీ వేస్తున్న కేసుల వెనుక కుట్ర కోణం దాగుందని సాక్షాత్తూ హైకోర్టే మొట్టికాయలు వేసిందని చెప్పారు. సాధారణంగా ప్రభుత్వ పరీక్షల జవాబు పత్రాలను పటిష్ట బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూములలో భద్రపరుస్తారని వివరించారు. కానీ వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ పరీక్షల జవాబుపత్రాలను ఎటువంటి భద్రత లేకుండా ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో ఉంచారని విమర్శించారు. అర్హత లేని వ్యక్తులతో ఆ పరీక్షల జవాబుపత్రాలను దిద్దించారని ఆరోపించారు. వైసీపీ పాలనలో గ్రూప్-1 పరీక్ష ప్రక్రియ మొత్తాన్ని ఏపీపీఎస్సీ చైర్మన్ గానీ, కమిటీ గానీ ఆమోదించకుండానే నిర్వహించారని చెప్పారు.రూల్ 17, క్లాజ్ 19 ప్రకారం ఏపీపీఎస్సీ చేపట్టే ఏ ప్రక్రియకైనా కమిషన్ చైర్మన్ ఆమోదం తప్పనిసరి అని ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి గుర్తు చేశారు. అనాదిగా వస్తున్న నిబంధనలను తుంగలో తొక్కి డిజిటల్ మూల్యాంకనం ఎందుకు చేయించారో సమాధానం చెప్పాలని గొడ్డలి పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు మంత్రి పార్థసారథి డిమాండ్ చేశారు. ప్రజలు అమాయకులు, ఏది చెప్పినా నమ్ముతారనే భ్రమలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి బతుకుతున్నారని అన్నారు.ఏపీపీఎస్సీ అక్రమాలపై సమగ్ర విచారణకు స్వయంగా హైకోర్టే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను నియమించిందని మంత్రి పార్థసారథి తెలిపారు. డిజిటల్ కరెక్షన్ కోసం కనీస ప్రామాణిక నిబంధనావళిని కూడా రూపొందించ లేదని అన్నారు. ఏపీపీఎస్సీ నిబంధనలకు విరుద్ధంగా వైట్నర్‌తో జవాబు పత్రాలన్నింటినీ మార్చేశారని చెప్పారు.హైకోర్టు నియమించిన సిట్ సమర్పించిన నివేదికపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ గొడ్డలి పార్టీ నేతలకు మంత్రి పార్థసారథి బహిరంగ సవాల్ విసిరారు. బటన్ నొక్కుడు మాటున వైసీపీ సాగించిన అక్రమాలను గమనించాలని ప్రజలకు సూచించారు. ఉద్దేశపూర్వకంగా అక్రమాలకు పాల్పడకపోతే డూప్లికేట్ ఓఎంఆర్ షీట్లను ఎందుకు సృష్టించారు? అని వైసీపీ నేతలను మంత్రి పార్థసారథి నిలదీశారు.

## చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లోకేశ్‌కు ఘనస్వాగతం

**చంద్రంపాలెం జిల్లా :** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల రూపురే ఖలను మార్చి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపా రు. విశాఖ నగర పరిధిలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6.5 కోట్ల రూపాయలతో దివీస్ ల్యాబ్స్ సామాజిక బాధ్యత నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను లోకేశ్ ప్రారంభించారు.విద్యార్థులతో సరదాగా ఆటలు ఆడుతూ : విద్యార్థుల కోసం కబడ్డీ, క్రికెట్, బాస్కెట్‌బాల్, బేస్‌బాల్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులను అందుబాటులోకి తెచ్చారు. అలాగే పాఠశాలలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేసి, వర్షపు నీరు నిలవకుండా ఆధునీకరించిన మైదానంలో విద్యార్థులతో కలిసి మంత్రి లోకేశ్ ఆటలు ఆడారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంల నిలువెత్తు విగ్రహాలను ఆవిష్కరించారు. విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం మూడు ఆర్వో సేఫ్ వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. పాఠశాల సమీపంలో జాతీయ రహదారి దాటే



విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని కూడా అందుబాటులోకి తెచ్చారు. లోకేశ్‌కు మార్చ్ ఫాస్ట్‌తో ఘన స్వాగతం : ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోకి అడుగు పెట్టిన మంత్రి లోకేశ్‌కు ఎన్‌సీసీ విద్యార్థులు మార్చ్ ఫాస్ట్‌తో ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిం చిన లోకేశ్, విద్యార్థులు అడిగిన ఆసక్తికరమైన ప్రశ్నలకు చమత్కారంగా, స్ఫూర్తిదాయకంగా సమాధానమి చ్చారు. పాఠశాల రోజుల్లో తాను చేసిన కొన్ని చిలిపి పనులను కూడా ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. 'చంద్రంపాలెం ఉన్నత పాఠశాలకు నేను ఇప్పటి వరకు మూడుసార్లు వచ్చాను. నాటి పరిస్థితులతో పోలిస్తే నేడు పాఠశాల రూపురేఖలు ఎంతో మారాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను ఇదే విధంగా మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. నేను ఈ స్థాయికి రావడానికి మా అమ్మే ముఖ్య కారణం. నా తల్లిదండ్రుల నుంచే క్రమశిక్షణ నేర్చుకున్నాను. నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. వారానికి ఒకసారి కుమారుడు దేవాన్ష్‌తో కలిసి 3 నుంచి 4 గంటలు ఆటలు ఆడతాను. కష్టకాలంలో ఉన్నప్పుడు మనల్ని ఆదరించి, తోడుగా నిలిచేవారే నిజమైన స్నేహితుల అవుతారు. ప్రతీ మనిషికి వారి జీవితంలో మంచి స్నేహితులు చాలా ముఖ్యం." - నారా లోకేశ్, విద్యా శాఖ మంత్రివిద్యార్థుల ప్రశ్నలకు ఆత్మీయ సమాధానాలు : సమాజమే దేవాలయం. ప్రజలే మన దేవుళ్లు అనే సూత్రంతో ప్రతీ ఒక్కరూ పదిమందికి ఉపయోగపడేలా సాయం చేయాలని మంత్రి నారా లోకేశ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఇచ్చిన ఆత్మీయ సమాధానాలు, విద్యార్థులను ప్రోత్సహించిన తీరు సభలో ఉన్నవారందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, దివీస్ లాబొరేటరీస్ డైరెక్టర్ నీలమా ప్రసాద్ దివి, తదితర ప్రముఖులు హాజరయ్యారు.

## జగన్‌వి గంజాయి బ్యాచ్ మీటింగ్‌లు

**అమరావతి, ఆగస్టు 22:** మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను టీడీపీ ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్రంగా ఖండించారు. ఇవన్నీ పచ్చి అబద్ధాలని మండిపడిన ఆయన, దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు. శనివారం కృష్ణా జిల్లా గుడివాడలో నిర్వహించిన




మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మెగా డీఎస్సీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని సీనియర్ ఐఏఎస్ అధికా రులు ఆధారాలతో సహా వివరించినప్పటికీ, వైఎస్సార్‌సీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని రామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియలో అవకతవక లు జరిగాయంటూ ఆ పార్టీ నేతలు దాఖలు చేసిన 341 పిటిషన్లను హైకోర్టు కొట్టివేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అధికారుల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోకుండా, ప్రజలను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా జగన్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు."చర్చకు రండి లేదా అసెంబ్లీకి వచ్చి మీ సందేహాలు తీర్చుకోండి.. మేం సమాధానం చెబుతాం" అంటూ గతంలో నారా లోకేశ్ విసిరిన సవాల్‌ను ప్రస్తావిస్తూ రామయ్య మరోసారి జగన్‌ను నిలదీశారు. జగన్‌ను కౌరవులతో పోల్చిన ఆయన.. సొంత తల్లి, చెల్లి కూడా ప్రస్తుతం ఆయనకు మద్దతుగా లేరని ఘాటు వ్యాఖ్యలు చేశారు. జగన్ నిర్వహిస్తున్న 'జెన్-జీ' సమావేశాలకు హాజరవుతున్నది 'గంజాయి బ్యాచ్' అని, అసలైన యువత లోకేశ్ వెంటే ఉందన్నారు. జగన్ హయాంలో గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సిట్ నివేదికను ప్రస్తావిస్తూ, ఆయన విలువల్లేని రాజకీయాలు పతనానికి దారితీస్తాయని హెచ్చరించారు.

# ట్రీసా-గాయత్రి జోడీకి చారిత్రక కాంస్యం!



ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత స్టార్ షట్లర్లు ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్ జోడీ అద్భుత ప్రదర్శనతో కాంస్య పతకం కైవసం చేసుకుంది. మహిళల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ నంబర్ వన్ చైనా ద్వయం లియు షెంగ్ షు, టాన్ నింగ్ చేతిలో పోరాడి ఓటమి పాలైనా, టోర్నీలో సగర్వంగా కాంస్యంతో సరిపెట్టుకుంది. గంటా 11 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ సెమీస్ పోరులో భారత జోడీ 21-18, 13-21, 8-21 తేడాతో పరాజయం చవిచూసింది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో ఈ యువ ద్వయానికి ఇదే తొలి పతకం కావడం విశేషం. ముఖ్యంగా 2011లో గుత్తా జ్వాలా, అశ్విని పొన్నప్ప జోడీ లండన్‌లో కాంస్యం సాధించిన తర్వాత, మళ్లీ మహిళల డబుల్స్‌లో భారత్‌కు పతకం రావడం ఇదే తొలిసారి. అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన ఈ జంట టోర్నీ ఆసాంతం అద్భుత ఆటతీరు కనబరిచి క్రీడాభిమానుల మన్ననలు పొందింది. సెమీస్ పోరులో భారత జంట ఉత్సాహంగా మ్యాచ్ ప్రారంభించింది. ఆరంభంలోనే 7-2 ఆధిక్యంలోకి వెళ్లినా, చైనా జోడీ పుంజుకుని విరామానికి 11-7 ఆధిక్యం సాధించింది. ఆ తర్వాత ట్రీసా, గాయత్రి అద్భుతంగా ఆడి స్కోరును 12-12 వద్ద సమం చేశారు. సుదీర్ఘ ర్యాలీలతో పాటు క్రాస్ కోర్ట్ షాట్లతో చెలరేగి తొలి గేమ్‌ను 21-18తో కైవసం చేసుకున్నారు. కానీ రెండో గేమ్‌లో చైనా జంట వ్యూహం మార్చింది. భారత జోడీ అనవసర తప్పిదాలు చేయడంతో పాటు నెట్ వద్ద తడబడటంతో చైనా ఆధిపత్యం ప్రదర్శించింది. కంటిన్యూగా పాయింట్లు సాధిస్తూ 21-13తో రెండో గేమ్‌ను గెలుచుకుంది. ఇక కీలకమైన మూడో గేమ్‌లో చైనా జోడీ పూర్తి స్థాయి ఆధిపత్యం చెలాయించింది. ఆరంభంలో 2-2 తో స్కోరు సమంగా ఉన్నా, ఆ తర్వాత చైనా క్రీడాకారిణులు ఆట వేగాన్ని పెంచారు. ట్రీసాను టార్గెట్ చేస్తూ వరుస పాయింట్లు రాబట్టి విరామ సమయానికి 11-5 తో భారీ ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. తొలి గేమ్‌లో చూపించిన దూకుడును భారత జోడీ పునరావృతం చేయలేకపోయింది. వరుసగా చేసిన తప్పులు చైనాకు కలిసొచ్చాయి. చివరకు ఏ దశలోనూ కోలుకోలేకపోయిన ట్రీసా, గాయత్రి జంట 8-21 తో మూడో గేమ్‌ను చేజార్చుకుంది. ఓడినా కాంస్య పతకంతో ఈ జోడీ చరిత్ర సృష్టించింది.

# బౌలింగ్ కూర్పుపై టీమ్ మేనేజ్మెంట్ కసరత్తు



శ్రీలంకతో కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరగనున్న రెండో టెస్ట్ మ్యాచ్ కోసం టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్ ఎంపికపై తీవ్ర కసరత్తు జరుగుతోంది. రిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ సారాంశ్ జైన్‌ను తీసుకోవాలా వద్దా అనే నిర్ణయం పూర్తిగా పిచ్ స్వభావంపైనే ఆధారపడి ఉంటుందని శ్రీలంక మాజీ క్రికెటర్ రస్సెల్ ఆర్నాల్డ్ వ్యాఖ్యానించాడు. గాలే వేదికగా జరిగిన మొదటి టెస్టులో ఇండియా 165 రన్స్ తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో కుల్దీప్ కేవలం ఒక వికెట్ మాత్రమే దక్కించుకున్నాడు. కుల్దీప్ స్థానంలో జట్టులోకి వస్తే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 181 వికెట్లు, 2,223 రన్స్ చేసిన ఇండోర్ ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్‌కు ఇది డెబ్యూ మ్యాచ్ అవుతుండటం విశేషం.శ్రీలంక జట్టులో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు రాణిస్తున్న నేపథ్యంలో ఆఫ్ స్పిన్నర్‌ను తీసుకోవడం లాజిక్కే అయినా, ప్రాక్టీస్ సెషన్ తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని ఆర్నాల్డ్ తెలిపాడు. పిచ్ పొడిగా ఉండి ఆది నుంచే టర్న్ అయ్యే అవకాశం ఉంటే సారాంశ్ జైన్ బెస్ట్ ఆప్షన్ అవుతాడని వ్యాఖ్యానించాడు. ఒకవేళ పిచ్ ఫ్లాట్‌గా ఉండి ఆట సాగుతున్న కొద్దీ నెమ్మదిస్తే మాత్రం ప్రత్యర్థిని బోల్తా కొట్టించడానికి కుల్దీప్ యాదవ్ నైపుణ్యం అవసరమని తెలిపాడు. మరోవైపు శ్రీలంక జట్టు టాప్ ఆర్డర్ వైఫల్యాలతో కొట్టుమిట్టాడుతోంది. గాలే టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 90 పరుగులకే 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి లంక చేతులెత్తేసింది. పాథుమ్ నిస్సాంక, కుసాల్ మెండిస్ గాయాలతో దూరం కాగా, దినేష్ చండిమల్ సైతం కంకషన్ కారణంగా కొలంబో మ్యాచ్‌కు అందుబాటులో ఉండటం లేదని సమాచారం. టెస్ట్ ఆడే అన్ని దేశాల్లో శ్రీలంక ఓపెనింగ్ భాగస్వామ్యాలు అత్యంత పేలవంగా ఉన్నాయని ఆర్నాల్డ్ గుర్తు చేశాడు. కొత్త బంతి గట్టిగా ఉన్నప్పుడు అనవసర దూకుడు ప్రదర్శించి వికెట్లు సమర్పించుకున్నారని, కామిందు మెండిస్ లాంటి అనుభవజ్ఞుడు కూడా అదే తప్పు చేశాడని నిట్టూర్చాడు. బంతి పాతబడే వరకు క్రీజులో నిలబడితే బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతుందని గుర్తు చేశాడు. కొలంబో మ్యాచ్ కోసం శ్రీలంక జట్టులోనూ మార్పులు ఉండవచ్చని ఆర్నాల్డ్ వ్యాఖ్యానించాడు. ఫాస్ట్ బౌలర్ లాహిరు కుమారను పక్కన పెట్టి ఆఫ్ స్పిన్నర్ రమేష్ మెండిస్‌ను తుది జట్టులోకి తీసుకునే చాన్స్ ఉందని పేర్కొన్నాడు. ఇద్దరు స్పిన్నర్లు చిన్న స్పెల్స్ వేస్తే మరింత తాజాగా, శక్తితో బౌలింగ్ చేయగలుగుతారని ఆర్నాల్డ్ తెలిపాడు. బ్యాటర్లను గాల్లోనే బోల్తా కొట్టించాలంటే పూర్తి ఫిట్‌నెస్‌తో బౌలింగ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నాడు. ఇక రెండో టెస్టు ఆదివారం నుంచి కొలంబో వేదికగా ప్రారంభం కానుంది.

# గాలే తరహాలోనే సమతుల్య పిచ్ సిద్ధం !



ఇండియన్ బ్యాటర్ల స్పిన్ బలహీనతను టార్గెట్ చేస్తూ డస్ట్‌బౌల్ పిచ్ రెడీ చేయాలన్న ఆలోచన ఉన్నప్పటికీ, కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగే రెండో టెస్టుకు గాలే తరహా బ్యాలెన్స్‌డ్ ట్రాక్ సిద్ధం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయని సమాచారం. తొలి టెస్టులో ఇండియా 165 రన్స్ తేడాతో ఘన విజయం సాధించి, సిరీస్ లో 1-0తో ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో ఐదు రోజుల పాటు పిచ్ సహజ సిద్ధమైన మార్పులతో బ్యాటర్లు, బౌలర్లకు సమాన అవకాశాలు ఇచ్చిందని విశ్లేషకులు పేర్కొం టున్నారు. ఆగస్టు 23 నుంచి ప్రారంభమయ్యే రెండో టెస్టుకు మితిమీరిన స్పిన్ పిచ్ తయారు చేస్తే అది లంక జట్టుకే రివర్స్ అయ్యే ప్రమాదం ఉందని శ్రీలంక క్రికెట్ బోర్డు అనుమానిస్తోంది. దినేష్ చండిమల్, కుసాల్ మెండిస్, పాథుమ్ నిస్సాంక లాంటి సీనియర్ల గైర్హాజరీలో యువ బ్యాటర్లకు అవకాశం ఇవ్వడానికి గాలే తరహా సమతుల్య పిచ్ సరైనదని లంక బోర్డు వర్గాలు భావిస్తున్నాయి. 1999 నుంచి 2009 మధ్య కాలంలో ఈ వేదికపై శ్రీలంక ఆడిన 12 టెస్టుల్లో ఆరు విజయాలు సాధించి మిగిలినవి డ్రా చేసుకుని చక్కని ప్రతిభ కనబర్చింది.. కుమార్ సంగక్కర, మహేల జయవర్ధనే భారీ స్కోర్లు సాధించగా, దిగ్గజ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ ప్రత్యర్థులను ముప్పు తిప్పలు పెట్టేవాడు. సీనియర్ ఆటగాళ్లు రిటైర్ అయ్యాక ఇక్కడి పిచ్ స్వభావం పూర్తిగా మారిపోయిందని నిపుణులు గుర్తు చేస్తున్నారు. తర్వాతి దశాబ్దంలో లంక ఇక్కడ ఆడిన ఏడు టెస్టుల్లో మూడింట్లో మాత్రమే గెలిచి, నాలుగింట్లో ఘోర పరాజయం పాలైంది.

రెండు సార్లు ఇండియా, పాకిస్తాన్ జట్లకు 400 కంటే ఎక్కువ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సమర్పించుకుని, ఓటమి పాలైంది. సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ లాంటి జట్లపై మాత్రమే లంక ఇక్కడ విజయాలు సాధించింది. సీనియర్ల శకం ముగిసిన తర్వాత ఇండియా, ఇంగ్లాండ్, పాకిస్తాన్ జట్లు ఇక్కడ సులభంగా ఆధిపత్యం కనబర్చాయి. రాబోయే రెండో టెస్టులో కూడా ఇదే సీన్ రిపీట్ అయ్యే ఛాన్స్ ఉందని నిపుణు లు జోస్యం చెబుతున్నారు. తొలుత బ్యాటింగ్ చేసే జట్టు మ్యాచ్ పై పట్టు సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలుస్తోంది.

సిరీస్ డ్రా చేయాలనే పట్టుదలతో ఉన్న ఆతిథ్య జట్టు పిచ్ రూపకల్పనలో ఏ నిర్ణయం తీసుకుంటుందో అనేది ఆసక్తికరంగా మారింది. ఇక ఈ మ్యాచ్ లో గెలిస్తే సిరీస్ సొంతం చేసుకోవడంతోపాటు, డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో మరింత ముందుకు పోతుంది టీమిండియా.

# నష్టాలతో బంగ్లా బీపీఎల్ రద్దు!!

ఇండియాతో స్వదేశంలో జరగాల్సిన కీలక ద్వైపాక్షిక సిరీస్ తేదీలు మారే అవకాశం ఉందని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చీఫ్ తమీమ్ ఇక్బాల్ పేర్కొన్నాడు. బీసీబీ తన వార్షిక క్యాలెండర్‌ను పునర్వ్యవస్థీకరిస్తుండటంతో ఈ పరిస్థితి తలెత్తిందని తెలుస్తోంది. షేర్-ఎ-బంగ్లా నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 9 వరకు అండర్-17, అండర్-19, అండర్-23 విభాగాల ఆటగాళ్లతో గేమ్ డెవలప్‌మెంట్ టోర్నమెంట్‌ను బీసీబీ జరుపనుంది. ఇండియాతో సిరీస్ షెడ్యూల్ ఖరారైన తర్వాతే మిర్పూర్ లేదా బసుంధర గ్రౌండ్‌లో వేదికలను సర్దుబాటు చేస్తామని పేర్కొన్నాడు. ఢిల్లీ వేదికగా సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు ఆఫ్ఘనిస్తాన్‌తో ఇండియా మూడు టీ20ల సిరీస్ ఆడాల్సి ఉండటంతో సెప్టెంబర్ విండోలో ఇండియా-బంగ్లా సిరీస్ దాదాపు అసాధ్యమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ టూర్ ఖరారైతే బంగ్లాకు కనకవర్షం కురుస్తుందని, అందుకే టూర్ పై గంపెడాశలు పెట్టుకుందని నిపుణులు పేర్కొంటున్నారు. అవినీతి ఆరోపణలు, వివాదాల్లో చిక్కుకున్న బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ ఈ ఏడాది నిర్వహించకపోవచ్చని తమీమ్ పేర్కొన్నాడు. గత రెండు సీజన్లలో బీపీఎల్ కారణంగా బీసీబీ దాదాపు 40 కోట్ల బంగ్లాదేశ్ టాకా (రూ. 31 కోట్లు) నష్టపోయిందని తెలిపాడు. సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ప్రతీ ఏటా టోర్నీని నిర్వహించడం ముఖ్యం కాదని, అవసరమైతే సరైన ఫార్ములా కోసం ఒకటి లేదా రెండేళ్లు సమయం తీసుకుంటామని వెల్లడించాడు. ఫ్రాంచైజీలతో సంప్రది ంపులు మొదలయ్యాయని, డిఫాల్టర్ల సమస్యలు, చెల్లింపులు, బ్యాంక్ గ్యారెంటీలను పరిష్కరించిన తర్వాతే టోర్నీని లాభదాయక మార్గంలోకి తెచ్చి నిర్వహిస్తామని పేర్కొన్నాడు.వచ్చే ఏడాది ఏప్రిల్-మే నాటికి ఫ్రాంచైజీలను సిద్ధం చేయాలని బోర్డు ప్రణాళికగా ఉంది. ఎవరైనా తప్పుకుంటే ప్రత్యామ్నా యాన్ని చూసేందుకు తగిన సమయం అవసరమని, దేశవాళీ క్యాలెండర్ పనుల్లో 60-70 శాతం పూర్తయిందని తమీమ్ పేర్కొన్నాడు. లీగ్ రద్దయితే క్రికెటర్లకు ఆర్థిక నష్టం వాటిల్లుతుందని తనకు తెలుసని, బోర్డు భవిష్యత్తు కోసమే ఈ కఠిన నిర్ణయా లు తీసుకుంటున్నట్లు ఆటగాళ్లకు వ్యక్తిగతంగా వివరిస్తున్నానని తెలిపాడు. సరైన మార్పులతో రాబోయే రోజుల్లో కొత్త రూపంలో ముందుకొస్తామని బోర్డు ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్ సందర్భంగా భారత్‌తో సంబంధాలు తెంచుకుని, టోర్నీని బహిష్కిం చిన బంగ్లాకు.. ఇప్పుడు బుద్ధి వచ్చిందని, ఇండియా విలువ తెలిసి వచ్చిందని భారత ఫ్యాన్స్ భావిస్తున్నారు.




# సిరీస్ పట్టేస్తారా?

● 2-0 విజయంపై భారత్ గురి ● సమంపై ఆతిథ్య శ్రీలంక ఆశలు ● నేటి నుంచి భారత్, శ్రీలంక రెండో టెస్టు ● ఉదయం 10 నుంచి సోనీస్పోర్ట్స్‌లో...




**కొలంబో:** స్పిన్ సవాల్‌ను ఎదుర్కోవటంలో శుభ్‌మన్ సేన సఫలం అవుతుందా? అనే అనుమానాలతో మొదలైన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో.. గాలె టెస్టులో విజయంతో ఆ అనుమానాలకు భారత్ గట్టి సమాధానమే ఇచ్చింది. స్పిన్‌ను సమర్థవంతంగా ఆడటంతో పాటు స్పిన్‌తో ప్రత్యర్థిని మాయ చేయటంలో భారత్ విజయవంతమైంది. ఆరంభంలో పేస్, ఆఖర్లో స్పిన్‌కు సహకరించే కొలంబోలో భారత్, శ్రీలంక నేటి నుంచి రెండో టెస్టులో ఢీకొట్టనున్నాయి. స్పిన్నర్ల మాయాజాలంపై ఆతిథ్య లంకేయులు ఆశలు పెట్టుకోగా.. భారత్ సమిష్టి ప్రదర్శన పునరావృతం చేయాలనే ఆలోచనతో బరిలోకి దిగుతోంది. **కుల్‌దీప్‌కు అగ్ని పరీక్ష** చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ కెరీర్‌లో అగ్ని పరీక్ష ఎదుర్కొంటున్నాడు. గాలె టెస్టులో భారత స్పిన్ త్రయం మాయ చేసినా.. ముగ్గురు స్పిన్నర్లలో అంచనాలను అందుకోలేని స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఒక్కడే. ఒక్క వికెట్ మాత్రమే పడగొట్టిన కుల్‌దీప్ యాదవ్ మ్యాచ్లో బ్యాటర్లపై ఒత్తిడి పెంచలేదు. యువ స్పిన్నర్ మానవ్ సుతార్ వికెట్ల జాతర సాగించగా, సీనియర్ స్పిన్నర్ రవీంద్ర జడేజా ఆశించిన మేరకు రాణించాడు. దీంతో తుది జట్టులో కుల్‌దీప్ యాదవ్ చోటు ప్రశ్నార్థకంగా మారింది. రెండో టెస్టుకు కుల్‌దీప్‌ను కొనసాగిస్తారా? లేదా? అనేది తేలాల్సి ఉంది. కుల్‌దీప్ యాదవ్ ఫామ్ కోల్పోయాడా? జట్టు మేనేజ్‌మెంట్ అతడికి సరైన భరోసా ఇవ్వటం లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది. తొలి టెస్టులో భారత్ సమిష్టిగా రాణించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఒక్కడే బ్యాటింగ్ ఆర్డర్‌లో నిరాశపరిచాడు. కెఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ మెప్పించగా.. దేవదత్ పడిక్కల్ అదరగొట్టాడు. రిషబ్ పంత్, ధ్రువ్ జురెల్‌లు కీలక అర్థ సెంచరీలు సాధించారు. బ్యాటర్లు ఇదే జోరు కొలంబోలోనూ కొనసాగిస్తే భారత్‌కు తిరుగుండదు. వికెట్ల వేట ప్రధానంగా స్పిన్నర్లు చూసుకోగా.. పేసర్లు మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణలు చక్కటి సహకారం అందించారు. తొలి టెస్టులో ఆల్‌రౌండ్ షో చూపించిన భారత్ నేడు కొలంబోలో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. **సమం చేయాలని..** తొలి టెస్టులో ఓడినా, ఆతిథ్య జట్టు మరీ తీసికట్టుగా ఆడలేదు. సోనల్ దినుశ బ్యాట్‌తో గొప్పగా రాణించాడు. నిరోషన్ డిక్వెలా, ధనంజయ డిసిల్వలు అర్ధ సెంచరీలతో మెరిశారు. ఈ ముగ్గురికి బ్యాటింగ్ లైనప్‌లో కామిందు మెండిస్, లహిరు ఉదార సహకారం దక్కితే పరుగుల వేటలో కష్టాలు ఉండవు. కానీ బౌలింగ్ విభాగంలో స్పిన్నర్లు పూర్తిగా తేలిపోయారు. కేశర నువాంత, ప్రభాత్ జయసూర్య భారత్‌ను ఇరకాటంలో పెడతారనే అంచనాలు తలకిందులయ్యాయి. ఈ ఇద్దరిని భారత బ్యాటర్లు అలవోకగా ఆడారు. పేసర్లు ఫెర్నాండో, కుమార సైతం ప్రభావం చూపించలేదు. బ్యాట్‌తో శ్రీలంక మెరుగ్గానే కనిపిస్తున్నా.. టెస్టుల్లో విజయానికి బౌలర్లు 20 వికెట్లు పడగొట్టాలి. ఇక్కడే ఆతిథ్య శ్రీలంక బలహీనంగా కనిపిస్తోంది.




చిరు పుట్టిన రోజు కానుక.

# మెగా అభిమానులకు 'కాకా' ట్రీట్!

మెగాస్టార్ చిరంజీవి తన పుట్టినరోజు (ఆగస్ట్ 22) సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక ఇచ్చారు. ఆయన కథానాయకుడిగా, టాలెంటెడ్ డైరెక్టర్ బాబీ కొల్లి దర్శకత్వంలో రూపొందుతున్న 'మెగా 158' చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు 'కాకా' అనే పేరును ఖరారు చేస్తూ, ఒక పవర్‌ఫుల్ టైటిల్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఈ ప్రకటనతో మెగా అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి. ఈ చిత్రంలో చిరంజీవి 'సత్యం' అనే మధ్యతరగతి వ్యక్తి పాత్రలో కనిపించనున్నారు. అయితే, టైటిల్ గ్లింప్స్‌లో ఆయనను యంగ్ అండ్ స్టైలిష్ లుక్‌లో, గన్స్ పేలుస్తూ మాస్ అవతార్‌లో చూపించారు. దీంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ చిత్రాన్ని 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. గతంలో 'వాల్తేరు వీరయ్య'తో సంక్రాంతికి బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించిన ఈ కాంబినేషన్, మరోసారి అదే పండగకు రానుండటం విశేషం. 'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత చిరంజీవి-బాబీ కలయికలో వస్తున్న సినిమా కావడంతో 'కాకా'పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ప్రముఖ స్టంట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్ నేతృత్వంలో చిత్రీకరించిన ఒక భారీ ఫైట్ ఎపిసోడ్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందని సమాచారం. ఈ యాక్షన్ సన్నివేశాల్లో చిరంజీవి ఎంతో అంకితభావంతో, డూప్ లేకుండా రిస్కీ స్టంట్స్ చేశారని తెలుస్తోంది. మునుపెన్నడూ చూడని రీతిలో చిరంజీవి ఈ ఫైట్‌లో కనిపిస్తారని టాక్. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో భారీ చిత్రాలు నిర్మిస్తున్న ఈ సంస్థకు తెలుగులో ఇదే తొలి సినిమా. ఈ సినిమాలో నివేదా పేతురాజ్, మలయాళ నటి అనశ్వర రాజన్ కీలక పాత్రలు పోషిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందిస్తున్నారు.




# రవితేజ 'ఇరుముడి' జోరు.. అదనపు స్క్రీన్లు, షోలు

మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తుండటంతో, తెలుగు రాష్ట్రాల్లో అదనపు షోలను, మరిన్ని థియేటర్లను జోడిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సినిమాకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటూ మంచి వసూళ్లను సాధిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కొత్త థియేటర్లను జోడించడంతో పాటు, ఉన్న థియేటర్లలోనూ అదనపు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. 'రవన్న బాక్సాఫీస్ దండయాత్ర' కొనసాగుతోందని చిత్రబృందం ప్రచార చిత్రాల ద్వారా పేర్కొంటోంది. ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం అదనపు ఆకర్షణగా నిలిచింది. టీ-సిరీస్ ఫిలిమ్స్ సమర్పణలో విడుదలైన 'ఇరుముడి', రవితేజ అభిమానులను, మాస్ సినీ ప్రియులను అలరిస్తూ థియేటర్లలో విజయవంతంగా తన ప్రదర్శనను కొనసాగిస్తోంది.

# 'అల బొలెలో' సాంగ్ పూర్ణ స్టెప్పులు అదుర్స్!

సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా, చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ సినిమా నుంచి తొలి పాట 'అల బొలెలో'ను శుక్రవారం విడుదల చేసి అభిమానులకు పండగలాంటి వార్త చెప్పింది.
యువ సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ స్వరపరిచిన ఈ ఫుట్ ట్యాపింగ్ నంబర్‌ను ఆయనే స్వయంగా ఆలపించడం విశేషం. దర్శకుడు అరుణ్‌రాజా కామరాజ్ దీనికి సాహిత్యం అందించారు. అయితే, ఈ పాటలో సంగీతం, సాహిత్యం కంటే ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ సమకూర్చిన స్టెప్పులు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా నటి పూర్ణ (షామ్నా కాసిం) తన అద్భుతమైన డ్యాన్స్‌తో, హావభావాలతో ఎంతగానో ఆకట్టుకున్నారు. ఆమె డ్యాన్స్ పాటకు ప్రత్యేక కళను తెచ్చిపెట్టింది. ఈ చిత్రంలో భాగం కావడంపై నటి పూర్ణ ఇటీవల తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ""జైలర్ 2' లాంటి భారీ చిత్రంలో నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఇది ఒక కల నిజమైనట్లుంది" అంటూ ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. ఈ అవకాశం ఇచ్చినందుకు రజినీకాంత్, దర్శకుడు నెల్సన్, అనిరుధ్, జానీ మాస్టర్‌తో పాటు చిత్ర బృందానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. గతంలో విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ టీజర్‌లో నటుడు వినాయకన్ చెప్పిన డైలాగ్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. "నన్ను చంపి నువ్వు ప్రశాంతంగా ఉండలేవు. నా వెనుక పెద్ద ప్రపంచం ఉంది జైలర్!" అంటూ ఆయన చెప్పే డైలాగ్, ఆ తర్వాత రజినీకాంత్ స్టైలిష్ ఎంట్రీ సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే 'జైలర్ 2' షూటింగ్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ ప్రకటించగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.




# 'స్పిరిట్' వివాదం.. ఒక్క 'లైక్'తో వంగా బ్రదర్స్‌కు దీపిక పదుకొణె స్ట్రాంగ్ రిప్లై

ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న పాన్-ఇండియా చిత్రం 'స్పిరిట్' చుట్టూ అలుముకున్న వివాదం కొత్త మలుపు తీసుకుంది. ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంపై నిర్మాత, సందీప్ రెడ్డి సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా చేసిన ఆరోపణలకు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపిక పదుకొణె పరోక్షంగా, కానీ చాలా బలంగా స్పందించారు. వంగా సోదరులను విమర్శిస్తూ రాసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌ను 'లైక్' చేయడం ద్వారా ఆమె తన వైఖరిని స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రణయ్ రెడ్డి మాట్లాడుతూ.. దీపిక ఈ సినిమా లాభాల్లో 10 శాతం వాటా అడిగారని, డేట్స్ సర్దుబాటు చేయలేకపోయారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా చర్చలు విఫలమయ్యాక సినిమా కథ, పాత్రకు సంబంధించిన అంతర్గత విషయాలను ఆమె లీక్ చేశారని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్థికంగా తమకు వర్కవుట్ కాకపోవడం వల్లే ఆమెను ప్రాజెక్ట్ నుంచి తప్పించాల్సి వచ్చిందని వివరించారు. ఈ ఆరోపణలపై దీపిక నేరుగా ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ, ఓ జర్నలిస్ట్ పెట్టిన పోస్ట్‌కు ఆమె మద్దతు తెలిపారు. "దీపిక 10% లాభం అడిగితే, మొత్తం వంగా ఆస్తిని అడిగినట్టు ఎందుకు ఫీల్ అవుతున్నారు? ఇది స్పష్టంగా మగ అహంకార సంక్షోభం. ఒక మహిళ 'నో' చెప్పడాన్ని వీరు జీర్ణించుకోలేకపోతున్నారు" అని ఆ పోస్ట్‌లో జర్నలిస్ట్ పేర్కొన్నారు. ఏళ్ల తరబడి మగ స్టార్లు లాభాల్లో వాటాలు, అనుకూలమైన పని గంటలు వంటివి డిమాండ్ చేస్తున్నారని, అలా చేస్తే వారిని 'క్రమశిక్షణ' గలవారని అంటారని, అదే ఒక మహిళా స్టార్ అడిగితే 'ఇబ్బంది పెట్టే వ్యక్తి'గా ముద్ర వేస్తారని ఆ పోస్ట్ విమర్శించారు. ఒప్పందం రద్దయి నెలలు గడుస్తున్నా వంగా సోదరులు ఇంకా ఆమె గురించే మాట్లాడటం వృత్తి నైపుణ్యం కాదని, ఇది పూర్తిగా లింగ వివక్ష, మగ అహంకారమేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. "ఆమె నో చెప్పింది. దాన్ని అంగీకరించి ముందుకు సాగండి" అంటూ పోస్ట్‌లో జర్నలిస్ట్ రాసుకొచ్చారు. మొత్తానికి దీపిక నేరుగా స్పందించకపోయినా తన మద్దతు ద్వారా ఈ వివాదాన్ని మరో స్థాయికి తీసుకెళ్లారు. కేవలం రెమ్యూనరేషన్, డేట్స్ సమస్యగా మొదలైన ఈ వ్యవహారం ఇప్పుడు ఇండస్ట్రీలో లింగ సమానత్వం, మగ అహంకారంపై తీవ్ర చర్చకు




# ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్‌స్టార్' ట్యాగ్‌పై ప్రభాస్ రియాక్షన్

భారతీయ సినీ పరిశ్రమలో -బాహుబలి- చిత్రంతో పాన్-ఇండియా సంస్కృతికి శ్రీకారం చుట్టిన ప్రభాస్ తన ఇమేజ్‌కు ఏమాత్రం గర్వం ఆపాదించుకోని అరుదైన వ్యక్తిత్వంతో కనిపిస్తారు. సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం -స్పిరిట్-లో ప్రభాస్ పేరు ముందు -ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్‌స్టార్- అని వేయబోతున్నారనే వార్త అప్పట్లో సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ భారీ ట్యాగ్‌ను ప్రభాస్ ఎలా స్వీకరించారనే దానిపై నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా స్పందిస్తూ.. ప్రభాస్ గారి స్వభావానికి అద్దం పట్టే పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సాధారణంగా నటులు తమ బిరుదులు, ప్రచార ట్యాగ్‌ల విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉంటారు. అయితే ప్రభాస్ విషయంలో ఈ ప్రకటన ఎలా జరిగింది అన్న ప్రశ్నపై నిర్మాత వివరణ ఇస్తూ... టైటిల్ ఆవిష్కరణకు ముందే ఈ అంశాన్ని ఆయనతో ప్రస్తావించినట్లు తెలిపారు. దీనికి ప్రభాస్ ఎంతో క్యాజువల్‌గా తన సహజ సిద్ధమైన శైలిలో -మీ ఇష్టం డార్లింగ్- అంటూ ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా అంగీకారం తెలిపారట. ఈ ఒక్క చిన్న సమాధానం ప్రభాస్ నిరాడంబరతను, మేకర్స్‌పై ఆయనకు ఉన్న నమ్మకాన్ని స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్న ప్రభాస్ షూటింగ్ షెడ్యూళ్ల సర్దుబాటులో ఎంతో ఫ్లెక్సిబుల్‌గా వ్యవహరిస్తున్నారని నిర్మాత ప్రణయ్ వంగా పేర్కొన్నారు. ప్రస్తుతం హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న -ఫౌజీ- చిత్రం పూర్తయిన వెంటనే.. ఆయన పూర్తి స్థాయిలో -స్పిరిట్- సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు. రెండు భిన్నమైన మేకింగ్ శైలులు కలిగిన సినిమాల మధ్య ఎంతో నైపుణ్యంతో సమన్వయం పాటిస్తూ.. ప్రభాస్ డేట్లను కేటాయిస్తున్నారని ప్రణయ్ రెడ్డి వంగా కొనియాడారు.



# సెప్టెంబరు 1 నుంచి తమిళ సినిమాలు నో రిలీజ్...

తమిళ చిత్ర పరిశ్రమలో మరోసారి సంక్షోభం నెలకొంది. ఓటీటీ స్ట్రీమింగ్ నిబంధనలపై థియేటర్ యాజమాన్యాలతో తలెత్తిన విభేదాల నేపథ్యంలో, 2026 సెప్టెంబర్ 1 నుంచి కొత్త సినిమాల విడుదలను నిలిపివేయాలని తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (టీఎఫ్‌పీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వివాదానికి ప్రధాన కారణం.. థియేటర్లలో విడుదలైన సినిమాలను ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో స్ట్రీమింగ్ చేసే కాలపరిమితి. సినిమా విడుదలైన ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలోకి రావాలని థియేటర్ల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. సినిమాలు త్వరగా ఓటీటీలో అందుబాటులోకి రావడం వల్ల ప్రేక్షకులు థియేటర్లకు రావడం తగ్గుతోందని, తద్వారా తమ వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, నిర్మాతలు మాత్రం తమ వాణిజ్యపరమైన వెసులుబాటును కోరుకుంటున్నారు. ఈ వివాదం పరిష్కారమయ్యే వరకు కొత్త సినిమాలను విడుదల చేయకూడదని నిర్మాతల మండలి స్పష్టం చేసింది. అయితే, ఇది పూర్తిస్థాయి బంద్ కాదని, సినిమా షూటింగ్‌లు, పోస్ట్ ప్రొడక్షన్ పనులు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించింది. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, తమిళనాడు థియేటర్ యజమానుల సంఘం ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామం సెప్టెంబర్ నెలతో పాటు ఆ తర్వాత విడుదల కావాల్సిన పలు చిత్రాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.



"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569